వేదాంగాలు

# గృహ వాస్తు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.


Website: www.freegurukul.org    Mobile App: Free Gurukul    email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul    Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ రాఘవేంద్ర గురుభ్యోనమః

# సపరిమాణ జ్యోతిస్సారము

## చతుర్థ తరంగము

# గృహవాస్తు



—: రచయిత :—


వంశపరంపరానుభవ వైద్య, జ్యోతిషరత్న, వాస్తు స్వయంభువు

**శ్రీమాన్ తిరుమలనల్లాన్ చక్రవర్తుల**

వేంకట వరదాచార్యులు,

**కొండలదిన్నె (పోష్టు) — తాడిపత్రి (బ్రాంచి)**

**తాడిపత్రి తా॥)** **1977** (అనంతపురం జిల్లా.



— ప్రథమ ముద్రణము 500 ప్రతులు —


---


సర్వస్వామ్యములు రచయితవి. -o- వెల రు 5

శ్రీ రాఘవేంద్రగురుభ్యోనమః

# విజ్ఞాపన

మహాశయ! వాస్తుగ్రంథములెన్నిటనో చూచితినిగాని - మానవునికి, గ్రంథములు చెప్పువాటికి సంబంధములు గానబడలేదు. 'ఋణానుబంధరూపేణ పశుపత్నీసుతాలయ' అన్న వాక్యమునకు దూరమగుచున్నవి - మానవుని పూర్వపుణ్యమున మంచివి, పూర్వపాపమున చెడ్డవి లభించునని తేలుచున్నది. పెద్దవారనుచున్నారు. - మానవుడు పుట్టినప్పుడు ఏలాటి గృహమున పుట్టెనో, ఏలాటి చెకుబంది వుండినదో జీవితాంతము అట్టివాటియందే వుండునని తెలియుచున్నది జాతకానుగుణ్యముగా యిండ్లు మారుట, వాకిండ్లు మారుట, దిశలు మారుట, గ్రామములు మారుట జరుగునుగాని చెకుబంది మారదు. - గుడిశలో జననమై మహాడీలో వుండినను, భవనమందుండినను నలుదిశలగల చెకుబంది మారదని తేలుచున్నది. - ప్రకృత వాస్తుగ్రంథముల రీత్యా ధ్వజాయము వృషభాయము పెట్టి నిర్ధనికునకు గృహము కట్టియిచ్చిన ధనికుడు కాగలడా? - లేక జాతక రీత్యా సుఖదుఃఖములు, ధనిక నిర్ధనికత్వములు, వంశాభివృద్ధి మొదలగునవి గలుగుచున్నవా. - గృహములు చక్కగా కట్టుటవల్ల, మంత్రయంత్ర తంత్రముల వల్ల మానవుని జీవితఫలముల మార్పుచేయవచ్చునా. - పూర్వమొనర్చిన పాప పుణ్యముల వల్ల జీవులకు సుఖదుఃఖములు పదవులు మొదలగునవి గలుగుచున్నవా.- లేక మానవుని తెలివితేటలతో గలుగుచున్నవా అను సందేహములు అనేకము బయలుదేరును. ఈ సందేహముల తీర్పు శాస్త్రములు శూన్యమయ్యెగద. - సందేహములతోటి మూఢనమ్మకములను నాస్తికులు బయలుదేరిరి. చక్కని సమాధానమిచ్చు శాస్త్రముండిన ఈ సందేహములుండవు. - మూఢనమ్మకములను వారుండరుగద.

ప్రకృతమున్న శాస్త్రములవల్ల సందేహములు తీరునట్లు లేదే, దీనికేమిచేయవలయునను ఆలోచన నాలో గలిగి పరిశీలింత గలిగితిని. - మానవుని పాపపుణ్యానుసరణముగా గృ[illegible].

గృహోపకరణములు, భార్య, పుత్రులు మొదలగునవి గలుగు నని శాస్త్రమున్నదిగదా? అని పరిశోధింప మొదలిడితిని. వాస్తు ప్రాణమంతయు జ్యోతిశ్శాస్త్రమునందే యున్నదని గ్రహించితిని. గ్రహించినది నాలోనే లయమైన ప్రపంచమునకు నేను చేసిన మేలే మని ఆలోచించి గ్రంథరూపమున వెలువడింపవలెనని నిర్ధారణ చేసుకొని వ్రాయగలుగుశక్తినార్జించితిని అప్పటికెంతో కాలము పట్టెను - ఈ శాస్త్రమును సాంగోపాంగముగా తయారుచేయ వలెనను వుద్దేశ్యము దినదిన క్రమేణ పెరుగుచువచ్చెను. - శ్రీ సద్గురు రాఘవేంద్రుని అనుగ్రహముతో, శ్రీ శారదాదేవి కరుణా కటాక్షముతో ప్రశ్నలు - ప్రత్యుత్తరములు లభించుచునేవచ్చెను. వీరి అనుగ్రహము లేకున్న జ్యోతిశ్శాస్త్రమునుండి గృహవాస్తును, జలవాస్తును, గ్రామవాస్తును, దేవాలయవాస్తును, నవగ్రహమం డలవాస్తును ఇంకా అనేకవిషయములను, కృత్రిమములనదగినవి పూర్వులపద్ధతిని ఖండించుచు యదార్థ వచనముల దృష్టుకు తేజా లను. నేను కారణమాత్రుడను. వీరు నాకు జ్ఞానోదయమొసంగి వ్రాయించిరని తలంతును - స్వప్రమాణజ్యోతిస్సారమున గురు పాలితములని, శనిపాలితములని ద్వాదశలగ్నములలో విడదీసితిని. నవగ్రహములకు కారకత్వముల వ్రాసితిని. వీటిననుసరించిన గృహ భాగము చక్కగా తయారగును. విటిని పాటించకపోయిన చెప్పుట కలవిగాదు గృహము చెడును. తప్పదు. - జాతకరీత్యా జరుగ వలసినది జరుగకమానదు. - చక్కగా గృహముండిన సూర్యుని ముందు చత్రీవున్నట్లు సత్ కర్మకు కొంతవరకు సహాయమిచ్చును. దుష్కర్మను కొంతవరకు ఆపును. సత్కర్మలగు శుభముల రాగోరు చుండును. - ముందు రాబోవు కాలము మంచిదిగానుండువారికి చతుర్థశుద్ధిగలవారికి శాస్త్రమునకు వ్యతిరిక్తముగాక అన్ని హం గులు గలుగు గృహము లభించును. - మానవులు సుఖింతురు. చతుర్థమున శుభగ్రహము లేనివారు ఎంతధనికులైనను గృహము చక్కగానుండదు. వసతిగలుగు స్థానములుండవు. ఇది విధి విధా నము. - ప్రకృతమున్న శాస్త్రము అప్రమాణము కృత్రిమమని తేలినపుడు ప్రమాణముకొరకై వెతుకవలసివచ్చును శాసించినది

జరుగనప్పుడు యోచించవలసివచ్చును - విమర్శకు నిలువనిది, దృక్కుకురానిది శాస్త్రము కాదనవలసివచ్చును. అగ్నియైన కాలవలయును. శాస్త్రమనిన జరుగవలయును. శపించిన తగుల వలయును. కానిచో అది అగ్నిగాదు ఇది శాస్త్రము గాదు. అది నోరుగాదు అని ప్రజలనెదరు.

ఇట్టి వాక్యములనేకము విని నిరంతరము యోచించి, పరిశీలించి అనుభవముగడించునపుడు ప్రజలు పరిహాసించిరి పరాభవింపబడితినిగాని విడువలేదు దృక్కుకు వచ్చుదనుక పరిశోధించుట మానలేదు. దృక్కుకునచ్చినవి వ్రాసితిని. - దీనిని కాదని వేరొకమార్గము సృజించుటకు యెట్టివారికి వలనుపడదు. ప్రతి విషయము జ్యోతిశ్శాస్త్రమునందే వున్నదని తెలియుచున్నది. గృహ వాస్తు, జలవాస్తు మొదలుకొని వాస్తుసర్వస్వము జ్యోతిషమందే వున్నదని గమనించి శోధించి జ్యోతిషమునుండియే గడించి వ్రాసితిని. - అసలు శాస్త్రమంతరించి కృత్రిమ శాస్త్రములు బయలుదేరి శాస్త్రహీనమై దైవజ్ఞశబ్దమంతరించినది. ఉన్నదని కొందరు తలంచుచున్నారేగాని ప్రజలకు నమ్మకము చెడినది. ఎందరో ప్రజల భయపెట్టి, మోసగించి జీవించు శాస్త్రజ్ఞులు బయలుదేరి కొంత. కొందరు తెలియక వారి ఆదాయముకొరకై చేసెడి కార్యములతో కొంత. ఇది నా మతము, ఇది నా మతమని తెలిపిన వాక్యములతో కొంత దెబ్బతిని జోస్యమనిన తలనొప్పిగా బయలుదేరినది. - ఇదియుగాక ప్రశ్నించెడివారి ప్రశ్నలు విపరీతములు. మానవశక్తికి మితిమీరినవి. మానవుడు పోలేనిచోటనున్న ప్రశ్నలనే అడుగుదురు చెప్పలేకపోయిన యెక్కడి శాస్త్రమని పరిహసింతురు. మూఢనమ్మకమందురు - దీనివిలువ చెడుటవల్ల ఇట్టి విపరీతప్రశ్నలు వేయుచున్నారు.

ప్రకృతమున్న జ్యోతిశ్శాస్త్రములు, వాస్తుగ్రంథములు చదివి చదివి దారియేగానక చదివినవారికే నమ్మకము చెడుచున్నది. విసుగు గలుగుచున్నది - మూలలు త్రిప్పి, వంకరలు త్రిప్పి, గుండ్రములు త్రిప్పి, అనేకమైన మోట్లతో [illegible]

కొలతలులేక ఒకప్రక్కన బరువు మరొకప్రక్కన లఘువు పెట్టి, బహుద్వారముల గల్పించి, లక్షలాది ధన వ్యయముతో వసతి గృహములు భవనములు కట్టుచున్నారు ఇవి దారిద్ర్యమునకు, వంశనాశనమునకు త్రోవలు గల్పించును. మరొకరు తీసుకుండి నను వారిని విపత్తులపాలు చేయును. తలలు మార్చినా.- కడకు బాడుగకు యివ్వవలసివచ్చును. చేరినవారికందరికి అనుమానము గలిగించును.- గాన దీర్ఘచతుష్కోణాకృతి చెడిన గృహములు శ్రేయోదాయకములు గావు. జాతకునియొక్క గ్రహబలము ననుసరించి గృహము తయారగును.- జ్వరము వచ్చినవానికి మందిచ్చి బాగుచేసినట్లు చతుష్కోణము చెడకుండ శాస్త్రజ్ఞుడు ఆ పరువే గాని సంపూర్ణముగా మార్చుటకు నలవిగాదు. ప్రభుత్వమునకు ప్రజకు ఉపయుక్తమగునట్లు కృషిచేయుటమాత్రము జీవితాంతము విడువను.- కంటికగుపడునవి, పరిశోధనకు చిక్కినవి రెండవ ముద్రణలో చేర్చెదను.

ఖగోళమునందుండు నవగ్రహ కేంద్రములనుండి వచ్చు కిరణములు భూగోళమునగల జంగమస్థావర ప్రాణులందుచేరి నడిపించుచున్నవనియు, నవగ్రహకిరణములన్ని కలిసినప్పుడే ఒక జీవి యేర్పడుచున్నదనియు, ఒక్కొక గ్రహమువల్ల ఒకజీవ మేర్పడజాలదనియు, నవగ్రహ కిరణముల కలయికతో దేహము జ్ఞానము ధనము ఈ త్రిశక్తులు కలుగుచున్నవనియు తెలియుచున్నది.- ఖగోళమునగల నవగ్రహ మండలములలో జంగమస్థావర జీవరాసులు లేవనియు పైన నవగ్రహకిరణములొకచోట కలియవనియు, అట్లు కలియక దేహము జీవమేర్పడదనియు, భూమిపైననే యీ కిరణములు కలియుచున్నవనియు తెలియుచున్నది - చంద్రమండలమున మాత్రము పుట్టబోవు జీవులు పుట్టెడు సమయమునకై వేచియుండును. అందువల్లనే గురువు చంద్రుని చూచినప్పుడు చంద్రుడు కటకమున నున్నప్పుడు పుట్టుచుందురు.- శని చంద్రుని చూచినప్పుడు యెక్కువగా చచ్చుచుందురు. ఇట్లు జంగమస్థావరములకు గలుగుచున్నదని తేలుచున్నది.- గురు శనులు హరిహర రూపమై భూగోళమునగల సర్వజీవుల చావు పుట్టుకలతో ఆడించుచున్నారు.

ఇట్లు,- గ్రంథకర్త.

# శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ
# ప్రదత్త డాక్టరేట్ గౌరవ పట్టభద్రులు
# మహాకవి బ్ర॥ శ్రీ॥ గడియారము వేంకట శేషశాస్త్రి
# మహోదయుల అభినందన లేఖ.

---

శ్రీమాన్ తిరుమల నల్లాన్ చక్రవర్తుల వేంకట వరదాచార్యుల వారి సన్నిధికి మంగళాశీర్వచనములు.

మీరు పంపిన "గృహవాస్తు" అను గ్రంథమును జూచితిని. మీరు అనుభవపూర్వకముగాఁ దేల్చికొన్న విషయమును జనోపయోగము కొఱకు గ్రంథరూపమునఁ బ్రకటించుట యభినందనీయము. ఈ పని సామాన్యులు కూడఁ జేయుచున్నారు. విషయమునందు అధికారము చాలనివారు ప్రకటించు గ్రంథములు అనర్థదాయకములు. మీవంటి జ్యోతిశ్శాస్త్రానుభవముకల పెద్దలు చక్కఁగా యోజించి, శుభాశుభ ఫలముల నిరూపించి, సర్వజన సుబోధముగాఁ బ్రశ్నోత్తర రూపమునఁ బ్రకటించుట శ్రేయోదాయకము.

శాస్త్ర పరిశోధనము చేయఁదలచు జిజ్ఞాసువుల కీ గ్రంథము పాథేయమువలె నుపకరింపఁగలదు

మీకృషి హృదయ పూర్వకముగా నభినందించుచున్నాను. భగవంతుడు మీకుఁ జిరాయురారోగ్యభాగ్యములు ప్రసాదించి మీచే మఱికొన్ని యిట్టి శాస్త్రీయ గ్రంథములు రచింపఁజేయుఁగాక!

ప్రొద్దుటూరు.
4—7—77

గడియారం వేంకటశేషశాస్త్రి.

## అభినందనలేఖ

అరుదగు నధునాతనపుం
బిరుదుం గొనుపాండితీకవిత్వము లలమన్
వరదాచార్యులవలనన్
సొరిదిన్ గృహవాస్తురచన చొక్కంబయ్యెన్

పూర్వులయెడ చాదస్తము
ఖర్వార్వాచీన మాలికపు దృక్కులతో
సర్వులకుఁ దెలియ జాటిన
నిర్వాహక నిపుణరచన నీది మనీషీ.

జాతక చతుర్థ గృహమునం
దేతీరు గ్రహానుకూల్య మేర్పడు నిహమం
దాతని కాయిలు తప్పదు
చేతలు మేతల కటంచు చెప్పితివి కవీ.

తప్పింపలేవు శాస్త్రము
లెప్పటి కిదియిట్టులున్న నిటుజరుగుననున్
అప్పటివి తప్పు-నాదే
యొప్పనుటకు నెంతధైర్యమో యనిపించున్

గ్రహధాన్యాదిక దానము
విహితంబై వాస్తు హోమవిధి పూజలు దు
స్సహము లోకొ? ఊరటారట
తహతహలకె యంత్ర మంత్ర తంత్ర చయమ్ముల్.

శాస్త్రంపు చొరవ మాత్రము
నిస్త్రింశము ధారవోలె నిశితము మీలో
విస్మృతమా పురుషార్థపు
దస్త్రములన్ బ్రోదిచేసి ధన్యంబగుతన్.

తాడిపత్రి.
1—7—77.

జోస్యము జనార్దనశాస్త్రి విద్వాన్
తెలుగు పండిట్.

# వాస్తు స్వయంభూ యశఃపతాక

క॥ చెప్పిన వరదాచార్యుఁడె
చెప్పవలెన్ వాస్తువిషయ సిద్ధాంతము లె
ల్లప్పుడు జ్యోతిశ్శాస్త్రము
గుప్పిటఁ బట్టికొనియుండు కోవిదుఁడగుటన్.

ఉ॥ జాతకరాశి చక్రమున సర్వము గోచర మయ్యెడున్ బళు
వ్రాత సతీసుతాలయ పరంపరయెల్ల ఋణానుబంధ సం
పాతము వాస్తుపండితులవాద మవాస్తవ మంచుఁబల్కు మా
జ్యోతిషరత్నమిత్ర పరిశోధిత మార్గము నూత్నమై తగున్.

ఉ॥ పొంతనలేని శాస్త్రముల పోకడలారసి లేనిపోని సి
ద్ధాంతములెత్తి వాదములు దార్చి పునాదులుమార్చు వాస్తు శే
వంతుల దాడికిన్ గలఁగి వ్యర్థముగా ధనమున్వ్యయించు శ్రీ
మంతుల కీప్రబంధ మొకమార్గముఁజూపి శుభమ్ముఁ గూర్చెడిన్.

శా॥ జ్యోతిశ్శాస్త్ర పయఃపయోధి నిజధీ సువ్యగ్ర మంథాద్రి నా
పాతాళమ్ము మథించి యంచిత సుధాభాండంబు సాధించి వి
జ్ఞాతార్థమ్మును బంచిపెట్టు వరదాచార్యుండు శ్లాఘిష్ఠుఁ డీ
రీతిన్ లోకము శ్రేయమున్గను గతారిష్టమ్మగున్ మేల్కొనన్.

చ॥ శ్రమపడి యింత గ్రంథమును వ్రాసి యిటుల్ ప్రకటించె దీని సా
రముఁగొని యెవ్వఁడైన నొకప్రాజ్ఞుఁడు తాఁబ్రకటించెనేని గ్రం
థము పది వాని సొంతమని నమ్ము జగమ్ము మహాత్పరిశ్రమం
బు మఱుఁగునన్బడున్ యశముపొందెడు రేఖ యదెట్టులున్నదో!

మ॥ స్థలమున్ జూడక పట్టిజాతక సమీక్షంజేసి యేదిక్కునన్
జల మేమూలను ఎంతలోఁతునను ఏచాయన్ మహేమాత్ర మా
స్థల మందుండునో చెప్పఁజాలు వరదాచార్యుండు నిశ్చంకుఁడై
'పులి' యంచున్ నిజమున్ వచించు విబుధున్ బోలున్ గదా
మెచ్చుటల్.

మ॥ ఒకఁ డేదోయొకదానికై యడుగ సద్యోలగ్నమున్ గట్టి వా
నికిఁ దానప్పుడె మంచిచెడ్డలు దశానిష్ఠమ్ములన్ దెల్పి కా
ర్యకలాపమ్మును ఖర్చు తక్కువగు ప్రాయశ్చిత్తమున్ దెల్పు జా
తకముల్ లేవని సంశయింపక జనుల్ తండమ్ములై మూఁగఁగన్.

మత్తకోకిల—

వాస్తుశాస్త్రము నింతచక్కఁగ వ్రాసిచూపినవారు లే
రస్తమించెడు నార్ష దీపము నబ్బురంబుగ నిల్పుచున్
స్వస్తి కాంతులు విస్తరించిన సాధుశీలునిఁ బండితుల్
ప్రస్తుతింపరె నిన్ను జ్యోతిష పట్టభద్రునిఁ బల్మఱున్.

తేటగీతి—

అపరిపక్వ ధీకల్పిత విపుల వాస్తు
సంకర గ్రంథజాల కాశ్మల్యమడఁచి
జరగు వాస్తుస్వయంభూ యశఃపతాక
శింశుమార చక్రము ప్రకాశించుదాఁక.

మ॥ పుమపత్యంబది నీకు లేదనెడి వంఘం దీర్చి కొన్నాఁడ వు
త్తమసంతానముఁ గాంచి గ్రాంథికముఁ దచ్ఛాస్త్రీయ నానావిశే
షము లచ్ఛార్థము లాకళించికొని తోషంబందెదున్ లోక మా
హిమరశ్మ్యుష్ణగభస్తిక మ్మొనఁగు స్వామీ! నీ యశోరేఖయున్.

ప్రొద్దుటూరు.
4–7–1977

సి. వి. సుబ్బన్న ఎం.ఎ.,
శతావధాని.

శ్రీ

భిషగ్రత్న
కె. ఏ. నారాయణరావు, ఎం. ఏ.,
ఆర్. యం. పి. (ఆయుర్వేద)
రిటైర్డు డి. ఇ. ఓ.

అనంతపురం.
23-7-77

శ్రీ తిరుమల నల్లాన్ చక్రవర్తుల గురుపరంపరకు చెందిన పూజ్యులును, సరసకవులును, జ్యోతిస్స్మృతి శాస్త్రద్వయ వేత్తలునునైన యతిసార్వభౌముల కరుణకు పాత్రులగు శ్రీమాన్ వేంకట వరదాచార్యుల గృహవాస్తు నాలోకించి పులకించితిని.

అహో! ఆ వాగ్ధాటి నిరర్గళము. పురాతన శాస్త్ర విషయములను గొన్నిటిని పుక్కిటి పురాణములుగా నిరాకరించి, జ్యోతిశ్శాస్త్ర విషయములలో చతుర్థ పంచమ భాగ్యాధిపతుల కలయికయే ప్రధానముగా చతుర్థములో నాయాగ్రహముంచు ఫలములను అగాధముగా నిరూపించిరి. గృహవాస్తనగా చతుర్థభావ ఫలమే అనిరి. గృహాగ్రహములను విష్ణుపాలితములని, శివపాలితములని విభాగించి - ఫలానుగుణ్యముగ నట్టి విభాగమర్థవంతమని సోదాహరణముగ వివరించిరి.

లోకానుభవముల సంఘటీకరణమే జ్యోతిష్ఫలశాస్త్రము. (ఖగోళ, భౌతిక, రసాయనిక ప్రభృతి శాస్త్రములు ప్రత్యక్ష పరిశోధనల సమ్యక్సమీక్షాఫలితములే) అనుభవసూత్రముల కాదనుటకు వీలులేదు. - వీరి దృగ్విధానము క్రొంగ్రొత్త తెరువును సూచించినదనుట నిర్వివాదము. ఈ విధానము జ్యోతిశ్శాస్త్రమునకే అలంకారప్రాయము. - ఆయములు గుణించనీ గుణించకపోనీ దీర్ఘచతురస్ర సమాకృతి యుత్తమమను ఆచార్యుల వాదము నాకు 50 ఏండ్లనుండియు నంగీకృతమైనదే. హేయములు వెనుక - శ్రేయములు ముందు - నిర్మించుట సర్వసమాదరణీయమే. ఈ రెండంశములను ప్రభుత్వమువారును పాటించుట శుభావహమే యుండును. వీరి భావములు ఫలభాగమునకు నూత్నకాంతి ద్యోతకములనుట యదార్థము. "ఇతి శివం"

— క్షేమం —

పొడగట్లపల్లె.

8-8-77

శ్రీమాన్ తిరుమల నల్లాన్ చక్రవర్తుల
వేంకట వరదాచార్యుల వారికి

పిడపర్తి చినకృష్ణమూర్తి శాస్త్రి నమస్కరించి వ్రాయునది

అయ్యా!

పంచాంగ రచనయందు తొందరచే మీకు నా అభిప్రాయమును పంపుటలో కొంచమాలస్యమయినందులకు క్షంతవ్యుడను. నా అభిప్రాయమును ఇందు పొందుపరచుచున్నాను.

మీ పుస్తకమును సాంతముగ చూచినాను. మీ నూతన సృష్టి నాకు సంతసముకలిగించినది. ప్రశ్నోత్తరూపములోనున్న ఈ పుస్తకము వాస్తు విద్యార్థులకు బహు ఉపయోగకరమగును. వాస్తు నవనీతము బయటకు రాగలదని నా నిశ్చయాభిప్రాయము.

చిత్తగించవలెను.

దైవజ్ఞచింతామణి — పిడపర్తి చినకృష్ణమూర్తి శాస్త్రి,
శాస్త్ర సిద్ధాంతి,
పొడగట్లపల్లె P.O.
(వయా) ర్యాలి SPO

డా॥ దివాకర్ల వేంకటావధాని, M. A., (Hons) Ph. D.

ఆంధ్రాచార్యుడు - ఉస్మానియా విశ్వవిద్యాలయము,

18/4 R. T. బరకత్పుర, హైదరాబాదు - 27


తేది : 26_7_77

శ్రీమాన్ వేంకట వరదాచార్యులవారి దివ్యసన్నిధికి అనేక నమస్కారములుచేసి వ్రాయు విన్నపములు.

తమరత్యంత దయాదరములతో బంపిన సప్రమాణజ్యోతిస్సారమునందలి మూడు తరంగములు చేరినవి. చేరినదే తడవుగా నాకాశాస్త్రమునందు జ్ఞానము లేకున్నను కుతూహలముతో చదువుటకారంభించి విషయవైశద్యముచే నాకర్షింపఁబడి ప్రథమ - ద్వితీయ తరంగములందలి పెక్కు పుటలను, తృతీయ తరంగము నంతను చదివి యానందించితిని. శాస్త్రమెప్పుడును సత్యసమ్మతమును, నిరవద్యమునునై యుండును. కాని దానిని సమగ్రముగా నవలోకింపకయు, నందలి సిద్ధాంతముల సరిగా సమన్వయింపఁజాలకయు నీరోజులలో పలువురు శాస్త్రములకు - ముఖ్యముగా జ్యోతిశ్శాస్త్రమునకు అప్రామాణికత్వము కలిగించుచున్నారు. - ప్రాచీనమహర్షులు త్రికాలజ్ఞులు; వారి విజ్ఞానమనంతమైనట్టిది. అట్టివారు రచించిన శాస్త్రములలో లోపమెందుకుండును? వానిని సమగ్రముగా పఠించి, యందలి రహస్యములను గుర్తించి, వానితో సమాధనములను గూడ జతసేసిన ఫలితములాశ్చర్యజనకములుగా నుండును.

తమ రచనా విధానము మిక్కిలి హృద్యముగా నున్నది. శ్రీవత్సునికిని, గురువునకును జరిగిన సంభాషణల రూపమున గ్రంథమునంతను కొనసాగించియుంటిరి. సాధారణముగా నందఱికిని గలుగు సందేహజిజ్ఞాసలే తాము శ్రీవత్సుని నోట ననిపించి వానికన్నిటికిని వివరణపూర్వకముగ నిస్సందేహమునైన సమాధానము గురువుచే నిప్పించియున్నారు. జ్యోతిషములో నెట్టి పరిచయమును లేనివారు సైతము తమ గ్రంథము చదివి తమకు గావలసిన విషయములను తెలిసికొనఁ జాలుదురు. తామచ్చటచ్చట

నిచ్చిన ప్రాచ్య పాశ్చాత్య మహనీయుల జాతకములును వానికి తామొసంగిన వివరణములును తమ గ్రంథమును సప్రమాణము నొనరించి - తాము దానికొసంగిన నామమును సార్థకము చేయు చున్నవి. చతుర్థ తరంగము వాస్తువునకు సంబంధించినది. దీనిని సరిగా పాటింపకుండ పలువురు పెద్ద పెద్ద గృహములు నిర్మించి యిడుమలపాలగుట నేనెఱుగుదును. ఈభాగమంతయును శ్రద్ధతో జదివి యనుసరింపదగినట్టిది. తామెన్నో క్రొత్త విషయములను వివరించి, మూఢవిశ్వాసములను నిరసించి, అనుభవపరిశీలన జ్ఞానములను జోడించి యీ భాగమును సర్వజనోపయోగకరముగ సంతరించియున్నారు. ఈవిధముగా తామాంధ్రులకొనరించిన సాయమమేయమైనది. సౌకర్యభ్రాంతిచే శాస్త్రమునొప్పరికించువారికిది యొక కనువిప్పు.

తమ శైలిసరళము సుందరము. సర్వసుబోధమునై చూచిన వారికెల్ల చదివించునట్టిగా నున్నది. తృతీయ తరంగమును గూడ త్వరలో ముద్రింప నారంభించి జిజ్ఞాసువులకు మేలును, శాస్త్రమునకు వన్నెను చేకూర్తురుగాకయని ప్రార్థించుచున్నాను.



సమయమునకు తగినట్లు చక్కగా ముద్రణచేసియిచ్చిన శ్రీ రంగరామానుజ ప్రెస్ ప్రొప్రయిటర్ శ్రీ రంగయ్యగారికి, ముద్రణాలయ పనివారికి ఆయురారోగ్య భాగ్యములు భగవంతుడొసంగుగాక.

ఇట్లు - బుధజనవిధేయుడు,
రచయిత.

# శ్రీ రాఘవేంద్రస్వామి, మంత్రాలయము.



శ్లో॥ పూజ్యాయ రాఘవేంద్రాయ సత్యధర్మరతాయచ
భజతాం కల్పవృక్షాయ నమతాం కామధేనవే

---

## —: గురువాక్యములు :—

క॥ వాస్తుగ్రంథము లెంచగా
వాస్తవమున్ నెరుగజాలక వ్రాసిరి కవితల్
వాస్తవము నెరిగి పలికిన
వాస్తుకు జ్యోతిష్యమే ప్రాణమువంటిదౌ.

క॥ జ్యోతిషమున నణగినదని
జ్యోతిష్యులు తెలియలేక శోధింపకనే
కితిగ వాస్తు రచించిరి
జ్యోతిషమున్ వాస్తు విడి నయోమయమయ్యెన్.

కం॥ మునుపండితపుంగవులున్
జననుతమగు కావ్యమనుచు శాస్త్రంబనుచున్
ఘనముగ రచించిరెందరో
కనుగొన కృత్రిమములైన కావ్యములయ్యెన్.

కం॥ నీపలుకులు ప్రామాణ్యము
నీపలుకులు శాస్త్రమగుచు నెగడును ధాత్రిన్
నీపలుకులు వేదోక్తము
నీపలుకులమోఘమౌను నిజముగవత్సా.

కం॥ ప్రజలకు శుభఫలమొసగును
సుజనజనావళియు పొగడు చోద్యంబనుచున్
సృజియించెడి గ్రహములకున్
నిజతత్వంబెరుగచూపి నిలుపునువత్సా.

కం॥ అన్నియు జ్యోతిష్యంబున
నున్నవటంచెరుగలేక నుర్విని ప్రాజ్ఞుల్
చిన్నాభిన్నము చేయగ
నున్నతమగు శాస్త్రమ్ము శూన్యంబయ్యెన్.

కం॥ శాసించిన జరుగనవలె
శాసించిన జరుగకున్న శాస్త్రంబగునా
శాసించిన శాస్త్రంబులె
గాసిని కలిగించు బహుముఖంబులవత్సా.

కం॥ కలకాలము నిలుచునుభువ
కలకాలము శుభములొసగి గాచును ప్రజలన్
కలకాలము జ్యోతిషములకు
కలిమిని బలిమిని నొసంగు కావ్యము వత్సా.

కం॥ నానావిధముల జోస్యము
నానామతములనుచిక్కి నలిగి నశింపై
నానాటికి దిగజారెను
నానాటికి వృద్ధిచెందునా కెదురన్యోన్.

కం॥ పసగలిగిన శాస్త్రంబది
పసగలిగిన యట్టికవులు పండితులసగన్
పసగలిగిన దృక్కులతో
పసగలిగినరీతి కృతిని వ్రాయుమువత్సా.

కం॥ రారానిది వృద్ధిన్గన
నీరచనయె ప్రాణమగుచు నిలుచును ధాత్రిన్
భారము భారతిపైనిడు
భారము వహియించి కృతికి ప్రాణంబొసగున్.

కం॥ కోరకుమా పరధనముల
శ్రీ రమణీవాణి గారి సిరులొసగి కృతిన్
కోరినరీతి నొనర్చియు
శ్రీ రాజిల్లెడు పథంబు జేర్తురు వత్సా

కం॥ భయమావంతయు జెందకు
స్వయముగ నెరవేర్పగలవు సమకూరుశిరుల్
దయజూతురు మువ్వేల్పులు
జయమగునీకృతికి నీకు జయమా వత్సా.

శ్రీ రాఘవేంద్రగురుభ్యోనమః

శ్రీ లక్ష్మీనృసింహాయనమః

శ్రీ శారదాంబాయైనమః

శ్లో॥ శివం హరిం విధాతారం తత్పత్నీన్ తత్సుతాన్ గురూన్
నత్వా నమస్త్ర పరిత్యూహ శాంతయే మంగళాయచ.

శ్లో॥ నమస్సూర్యాయ సోమాయ మంగళాయ బుధాయచ
గురు శుక్ర శనేభ్యశ్చ రాహవే కేతవేనమః



## సప్తమహాణ జ్యోతిస్సారము
## చతుర్థ తరంగము

# ★ గృహవాస్తు ★

దేవా సూర్యనారాయణమూర్తి ప్రకృతమున్న వాస్తు గ్రంథములన్నిటను వ్రాసి మహాపండితుల మనిపించుకొన్న వారి గ్రంథములన్నిటను కృత్రిమములని, అపోహాములని, శాస్త్రదూవ్యమని నీవొసంగిన విజ్ఞానముతో నిరూపించిన పాపమేవచ్చునో పుణ్యమేవచ్చునో దానిని భరించు భారము నీదేప్రభూ!

స్వామీ! దయామయా! ఈకృత్రిమమునకు మయవాస్త్రే మొదటిదైవుండవచ్చునను కొందును. ఎలననగా గృహము కట్టు నపుడు శిల్పాచార్యులే ముఖ్యులు. వారే దీనిని ప్రప్రథమ ములో సృష్టించిరనుకొందును. వారు ప్రజలతో ఆదాయము పొందుటచూచి పౌరోహితులు ఆదాయముకొరకై కృష్ణవాస్తును సృష్టించిరి. దానితో అనేకమార్పులతో అనేకులు సృష్టించి

ప్రజలకు భయోత్పాతముల గలిగించిరనుకొందును. నిజతత్వ మేదో తెలియక కృత్రిమముల గల్పించి గందరగోళ మొనర్చిరి. గోటపోవుదానికి గొడ్డలి నుపయోగించిరి.

గృహ వాస్తునియు, జల వాస్తునియు, గ్రామాధర్వణము నియు, దేవాలయవాస్తునియు సృష్టించిరి. మానవుని యోగము ననుసరించి - గృహములు, బావులు, వనములు, భూములు, పశువులు మొదలగు సర్వసంపదలు సర్వవస్తు సముదయము. (స్థిరచరాస్తులు) సృష్టియగునని పూర్వుల వచనముల తలపైరి.

దయాఘయా, లోకబాంధవ! లోకహితార్థమై దీనికి సరియైన మార్గము చూపించి లోకుల నుద్ధరింపుము.

శ్రీవత్స= స్వామి, వాస్తు వాస్తుపురుషుడని వాస్తుపూజచేయుచున్నారే చేయతగ్గదేనందురు.

గురువు= నాయనా, వాస్తు శాస్త్రము వాస్తు పురుషుడు అని కృత్రిమముల గల్పించిరి. భూమిని భూదేవతలన్నారు. సర్వ వస్తువుల కంటించునదిగ, సర్వ లోహముల నవరత్నముల గర్భమున దాచుకొన్నదిగా, మానవులకందుబాటుగాని వస్తువుల ఎన్నిటనో దాచుకొన్నదిగా నుండుటవల్ల మాతృ రూపముగా తలంచిరి విష్ణుదేవునకు భార్యయనిరి. ఇది వాస్తవమైనది. వాస్తు అనగా - ఇల్లుకట్టు స్థలమన్నారు. ఇందులో వాస్తుపురుషుడెవరు. మహావిష్ణువా, లేక వీరు వేరా? స్త్రీ రూపమైన భూమిని పురుష రూపముగా పూజించుటెందుకు స్త్రీ రూపము బాగులేదనియా, భూ మాత పూజనీయురాలు కాదనియా.

శ్రీ= వాస్తుపురుష శాస్త్రమొకటున్నదే, దీని నేమందురు.

గు= ఏమందును. కృత్రిమమందును. అనేకులు అనేకవిధముల శాస్త్రముల గల్పించి, మానవుల కన్నవస్థలపాలు చేసిరే గాని - నిశ్చయమును గమనించకపోయిరి. వాస్తుపూజ

లేదు. వాస్తుపురుషుడు లేడు స్థలపుణ్యాహ వాచనము చేయుట మంచిది ఆ స్థలములో యెట్టి నీచములు జరిగెనో, ఎన్ని మాయమంతలు బూడ్చిరో, ఎన్ని యెముకలుండెనో, ఎన్ని బొగ్గులు, బూడిద వుండెనో, ఎన్ని భ్రూణ హత్యలు జరిగివుండెనో, ఇట్టివి ఎన్ని జరిగెనో తెలుసుకొనుట తీసివేయుట కష్టముగాబట్టి, స్థల పవిత్రత కొరకై పుణ్యాహవాచనము శుభము గాన చేయించుట క్షేమము. వేరుమార్గములు కృత్రిమములని తలంచుము.

శ్రీ== స్వామి, శంఖుస్థాపన చేయునపుడు స్థలపుణ్యాహవాచనముతో సరిపోవునందుర. ఇంక యేమైన చేయవలయునా. సందేహమును తీర్చుడు.

గు== నాయనా, నలుమూలల ముందుకొలిచి సక్రమపరచుకొని గుర్తులుంచుకొనివుండగా మధ్య దారములు కలియుచోటును ధృవమందురు. ఆ ధృవముపైన క్రొత్త వస్త్రమును పరచి, ఆ వస్త్రము ఆ స్థలమును యే గ్రహముచూచునో ఉండునో ఆ రంగుగలదిగానుండుట శ్రేయము. ఆ వస్త్రముపై ఆ గ్రహసంబంధ ధాన్యము పోసి, కలశము పెట్టి, గణపతిపూజ గృహిణీ గృహస్తులతో చేయించి పుణ్యాహవాచనము చేయవలయును. శంఖులు అయిదు వుండవలయును. ఆ శంఖులు సంద్రవిగాని, రంధ్రములేని ఎదురుతోగాని వుండవలయును. ప్రమాణము అడుగు వుండవలయును. వాటికి పసుపుపూసి, కుంకుమపెట్టి, రెండు తమలపాకులు చుట్టచుట్టి, పసుపుపూసిన దారముతో శంఖులకు కట్టి కలశముముందు పెట్టవలయును. అటుపై కలశోదకమును స్థలమంతటను ప్రోక్షించి, శంఖులపై ప్రోక్షించవలయును. - యజమానిని శంఖులు తీసుకొమ్మని యజమానికి యే గ్రహము శుభగ్రహమో ఆ మూలన పుణ్యాహవాచనజలము యజమాని దోసిటలోపోసి, మమ గృహ

నిర్మాణ సుముహూర్త శుభదిన శుభలగ్న శుభోదయవేళ శంఖుస్థాపనం కరిష్యే. అని ఆ జలమందు విడిపించి శంఖును కొట్టింపవలయును. కొట్టుచున్న శంఖు చీలరాదు. అటుపై ఈ సంకల్పముతో సవ్యముగ మూలలందు కొట్టింపవలయును. - ప్రథమ శంఖుదగ్గర మూడు పారల మట్టిని గృహస్తునితో తీసివేయించవలయును. అటుపై పునాదులుతీసి, భూమిమట్టమునకు గోడలువచ్చిన తదుపరి నలుదిశల గోడలపై చక్కగా సమముగా సిమెంటుతోగాని మట్టితోగాని అలికి, ఆరనిచ్చి సుముహూర్తమున మూలల త్రాడుపట్టిచూచి సున్నపుగుర్తులు వేయవలయును. ఎక్కువ వచ్చినది విడువవలయును.

ఆ గోడపై ఏ ఏ గ్రహమునకు ఏ ఏ రంగు వస్త్రములో అవి ఆయా దిశల గోడలపై పరచి, ఆయా ధాన్యముల పోసి, పూలు పండ్లు తాంబూలము టెంకాయపెట్టి ఆయా గ్రహములనందు ఆవాహన చేసి, యజమానితో పూజింపచేసి, నమస్కరింప చేయవలయును. - ఇట్లు నవ గ్రహములకు చేసి, అటుపై అన్ని గ్రహములకు ఉద్వాసన చేయవలయును. దానిపై యజమానికి ఏవి శుభ గ్రహములో ఆ ధాన్యమును విడచి, పాపగ్రహముల ధాన్యమును, వస్త్రముల బ్రాహ్మణులకు సంకల్పయుతముగా దానమియ్యవలయును.

శ్రీ= స్వామి, కొన్ని ధాన్యముల విడచి అన్నారే. అవి ఏవని తెలుసుకొనవలయును.

గు= వత్సా! మానవుడు పాపపుణ్య మిశ్రితుండని వ్రాసినాను జ్యోతిస్సార ప్రథమతరంగమున తెలిపితినిగదా. జాతకము ననుసరించియో, ప్రశ్నలగ్నము ననుసరించియో లగ్న మేర్పరచిన శుభాశుభులు తెలుదురుగదా. శుభగ్రహ

ముల ధాన్యము యజమానికి వదలి, అశుభ గ్రహముల ధాన్యము దానముగా నియ్యవలయును. దీనికి సంకల్పము చక్కగానుండవలయును. సంకల్పముండిన దోష పరిహార దానమగును. సంకల్పము లేకున్న పుణ్య దానమగును. సంకల్పము లేకున్న అడ్రసు (చిరునామా) లేని ఉత్తర మగును.

శ్రీ= స్వామి, విడచినధాన్యముల గృహస్తుడు భుజించవచ్చునా

గు= అవును. భుజింపతగినవి ఆనాడే భుజింపవచ్చును ప్రకృతము భుజింపరానివి గృహములో ఆయా ధాన్యములందు చేర్చుకొనుట శ్రేయము.

శ్రీ= స్వామీ, నవగ్రహధాన్యముల పౌరోహితము చేయించు వారే పరిగ్రహింతురే తప్పందురా.

గు= నాయనా, పాపగ్రహమునకు దానమిచ్చునపుడు - మమ గృహనిర్మాణస్థల పీడాపరిహారార్థం దుర్దోషనివారణార్థం అను వాక్యము చెప్పుచున్నాము. పాపముపోవలయునని తలంచుచున్నాము. శుభగ్రహములకు యేమని సంకల్పము చెప్పుచున్నాము మమ ఆయురారోగ్య భాగ్యవృద్ధ్యర్థం, గృహనిర్మాణస్థల శుభఫలా వాప్త్యర్థం పూజా విధానం కరిష్యే అని చెప్పుచున్నాము. పాపగ్రహములకు నారికేళ ఫల పుష్ప తాంబూల దక్షిణ వస్త్రసహిత దానంకరిష్యే అని చెప్పుచున్నాము. పాపము పోవలయునని పుణ్యము అభివృద్ధిగావలయునని భావము. అట్టివి అన్నీ యెత్తుకపోయిన పాపము పుణ్యము పోయినట్లగును. అప్పుడు గృహస్తుడు పాపము పుణ్యము లేనివాడగును. రెండుపోయిన వెనుక మానవుడు జీవచ్ఛవమగును. వలెన్నా, పాపమువల్ల అశుభములు కలుగకుండా దానము - పుణ్యమువల్ల కలుగు శుభములు అభివృద్ధిగావలయునని పూజ చేయుచున్నారు.

పుణ్యమును గృహస్తునికి విడచి, పాపమును తీసుకొనిపోవుటయే దానము. శుభగ్రహ పూజావస్తువుల పౌరోహితుడు యజమానికి వదలవలయును.

శ్రీ = స్వామి, జోస్యులు ఈ పద్ధతికి ప్రమాణమెక్కడున్నదని అడుగుదురు. దీనికేమందురు.

గు = వత్సా, ఇది తెలిసి తెలియక పలికెడి పలుకు. దీనిని పరిశీలించలేని శక్తిహీనత - శాసించినది. జరిగినయెడల అది శాస్త్రమగును శపించినది తగిలినయెడల అది నోరగును. లేకున్న అది శాస్త్రముగాదు. అది నోరుగాదు. నేను చెప్పినది జరుగునో జరుగదో చూచినకదా. చూడకనే దీనికి ప్రమాణమేది అనుట పొరపాటు. ముందు వ్రాసిన వాటికి ప్రమాణములున్నవా. వారే మానవులా. ఈ విషయమెరింగినవారనరు పరీక్షించిచూతురు ప్రకృతము ప్రమాణములేనివి అనంతముగా వెలువడుచున్నవే. వీటికెక్కడ ప్రమాణములున్నవో పరికించుము. - ప్రమాణ గ్రంథములు వ్రాసినవారు ఋషులనుట చూడ, బుద్ధిలేని పుత్రుడు తల్లిదండ్రుల దూషించచేసినట్లున్నది. భారత భూమియందుండిన ఋషీశ్వరులు దైవసమానులు. మట్టిని బంగారుగ బంగారును మట్టిగ మార్చగల మహానీయులు. అయోనిసంభూతులు. వారిని రచ్చకెక్కించి వారిపేరిడి తయారుచేసిన కృత్రిమశాస్త్రములని శాస్త్రముల దూషించెడివారు ప్రబలుచున్నారు. మహా ఘాచారములనుచున్నారు. దృక్సిద్ధ శాస్త్రమువచ్చిన నోరుమెదల్పక వశ్యత నొందురు - ఉదాహరణ = వత్సా, లగ్న పంచమ భాగ్యాధిపతుల కలయికగాని, ఈ గ్రహములు పంచమములో ఉచ్చస్థితినొందిగాని, పంచమాధిపతి పంచమములో ఉచ్ఛ నైనగాని, బలియుడై యుండినగాని యుండిన తరుణములో జన్మించి దశానుకూలత గలిగినయెడల క్రొత్త వస్తువుల

సృజింతురు వారి జ్ఞానమేవంక పరుగెత్తునో ఆవంక గమ్య స్థానము తప్పకచేరును. వారుచేసిన కార్యములు, కావ్యములు కలకాలముండును. అవి లోకులకుపకరించును. అట్లు లేక ఏదోకొంతవరకు శుభగ్రహవీక్షణ గలిగి, చేసిన కార్యములుపకరించి ఉపకరింపకపోవును కలకాలముండజాలవు. పంచమశుద్ధిగలిగినవారు ఒకరు చేసినకార్యమును చేయక క్రొత్త కార్యముల చేయుచుందురు అట్టివి సృజించుటకే వారు జన్మింతురు. శ్రీ గాంధీమహాత్ముని జాతకము చూడుము. పంచమశుద్ధియట్లున్నదో తులాలగ్నమై పంచమాధిపతియగు శని చంద్రుని చూడడము, చంద్రుడు ఏకాదశమగు సింహము నుండి పంచమమును చూడడము, చంద్రుడు బుద్ధికారకుడు గావడము, సింహము రాజ్యక్షేత్రము గావడమువల్ల చంద్రుడు దశమాధిపతియగుటవల్ల బుద్ధి స్థిరస్థాయిగానిలచి తా తలచినకార్యము నెరవేర్చెను. సత్యాగ్రహమను క్రొత్తపదమును సృష్టించెను. - రాజ్యమునే సంపాదించి స్థిరస్థాయిగా పేరుప్రతిష్ఠల నిలుపుకొనెను. తోడుగా నియమనిష్ఠలతో దైవశక్తిని సంపాదించెను. - ఇట్లే మహనీయులు కొందరు అనేక కార్యక్రమములచేసిరి. క్రొత్తదారుల త్రొక్కిరి. - పంచమ శుద్ధిలేక పంచమాధిపతి పాపుల గృహములందుండినవారు సృజించిన మార్గములు, నిర్మాణములు కొంతకాలమునకు ప్రజల చెరచును. విడదీయును. అందువల్లనే ఎన్నో మతములు, ఎన్నో భావలు, ఎన్నో ఆచారములు, ఎన్నో కులములు తెగలు, ఎన్నో జాట్లు బొట్లు గల్పించి ప్రజల బాధించిరి. ఒక్కజాతిని ఒక్కటిగా నుండనియ్యక చీలికలు చీలికలుగా జేసి విడదీసిరి. ఒకరుచెప్పినది ఒకరుచెప్పక అనేకమార్గముల గల్పించిరి. ప్రజలు చీలికలై ఒకరినొకరు ద్వేషించిరి నీచముగా జూచిరి. ఒక మతస్థుల ఒక మతస్థులు దుయ్యబట్టిరి. వీరి

జాతకములు విప్లవమార్గముల సృజించెను - ఇవి ప్రజోపయుక్తములుగావు. ఒకరు కరెంటును సృజించెను. అది సర్వదేశములకు సర్వులకు ఉపయుక్తమై వెలుగుచున్నది. ఇట్టివాటికి ప్రమాణము లెచ్చట గలవు. - ప్రమాణము సత్యమే. (దృశ్య)

ఒకానొకప్పుడు ఒకడు ఒక శాస్త్రమును కనిపెట్టును. మరికొంతకాలమునకు దానిలో తప్పులదిద్దువాడొకడు పుట్టును పుట్టకూడద. పుట్టి తప్పుల దిద్దకూడద. వానికున్న కొమ్ములు వీనికి మొలవకూడద సత్యాన్వేషణ చేయను బుద్ధిబలముగావలయును బుద్ధిబలము గలుగుటకు పంచమశుద్ధిగావలయును. పంచమశుద్ధిగలుగుటకు పూర్వజన్మ సుకృతముండవలయును. అనగా పూర్వ జన్మలో సరస్వతీధ్యానము చేసియుండవలయును. అట్టివారే సత్యము నెరుంగువారు - ప్రమాణము దృశ్యమువచ్చును. దృశ్యమువచ్చినదే ప్రమాణము - అటుగాక ముందు వ్రాసినవన్ని చెప్పినవన్నీ ప్రమాణములేననుట మూఢనమ్మకమౌను.

వాస్తుగ్రంథములు ఏమి చెప్పుచున్నవో గమనింపుము. - నిడివి యెనిమిదిమూరలు, వెడల్పు యెనిమిది మూరలైనప్పుడు యెనిమిది యెనుముదులు అరువదినాలుగు వచ్చును. దీనిని పదమందురు - దీనిని తిథి వార నక్షత్ర యోగకరణములు అష్టదిక్కులు ఆయుర్దాయము మొదలగు వాటితో పదమును భాగించగా శేషము శుభాశుభముల తెలుపునని భావించిరి. ఇది గమ్యస్థానము చేర్చుదారి గాదని తెలియరైరి.

వత్సా, వాస్తు జ్యోతిశ్శాస్త్రములో నొక పదమని తెలియక తెలుపక పలువిధముల గ్రంథముల రచించిరి. జ్యోతిశ్శాస్త్రమంతయు రెండు భాగలేగాని బహు భాగములు గాదు. గుణిత భాగము, ఫలభాగము అని రెండు విధములు

గుణితశాస్త్రజ్ఞునికి ఫలభాగము చక్కగా తెలియవలయును. ఫలభాగము చెప్పెడివానికి గుణిత భాగము తెలియకున్నను ఫరవాలేదు. ఫల భాగము తెలియకనే పంచాంగఫలములు దెబ్బతినుచున్నవి. ఈ వాస్తు గ్రంథ కర్తలను జ్యోతిషము బొత్తిగా తెలియనివారనవలయును. లగ్న చతుర్థములో గృహము, బావి, భూమి మొదలగునవి అనేకమున్నట్లు చెప్పిరిగదా. దాని నుండి విమర్శించవలయునేగాని ఈ విధముగాచేసిన వాని గృహఫల మెట్లు చెప్పనలవియగును. జాతకుననుసరించి గృహముండును గాని వీరు చెప్పినట్లు యెట్లుండును. స్థల భోగము, పర భోగము, శిల భోగమన్నారు. ఆ స్థలమున గృహమగు యోగము రావలయును. ఎప్పుడు వచ్చునను కాలము తెలియవలయునుగదా.

శ్రీ= స్వామి, స్థలభోగమన్నారే స్థలమునకు భోగమెట్లువచ్చును.

గు= శ్రీవత్సా! దిబ్బలు, మలమూత్రవిసర్జన స్థానములు, పశుగ్రాసము, వంటకట్టెయలు, కంపపుల్లలు వేయుచోట్లు, ఇల్లు పాడయి మొండిగోడలున్నచోట్లు, విధవల రిజిష్టరు స్త్రీల పేరనున్న స్థలము, చెట్లు కొట్టివేయుస్థలము ఇట్టి స్థలమునకు భోగమువచ్చునప్పుడు గృహముగామారి మానవులు నివసించుటకు, సుఖించుటకు, దేవతారాధనచేయుటకు, శుభకార్యములు చేయుటకు, పదిమంది సమూహముతో పిల్లలతో పశుసంపదతో కలకలలాడుటయే స్థలభోగము.

నిరుపేదవై అన్నవస్త్రములకు అటమట పడుచున్న మానవుడు పూర్వజన్మ సుకృతముతో అష్టయిశ్వర్యములతో, అష్ట భోగములతో సర్వసౌఖ్యములనుభవించుటే పరభోగము.

సంజె దీపారాధనలేక, పూజా పురస్కారములులేక దిబ్బలై సకలజీవములకు నెలవై శిథిలమై అనుకొనువారు

లేని దేవాలయము - వైభవోపేతముగ దేవాలయము తయారై నిత్యకైంకర్యములు జరుగుచు, తిరుణాల తేరు తీర్థవాసులు జరుగుచు, భక్తులిచ్చు ఆతిథ్యముల స్వీకరించుటే శిల భోగము.

అట్టికాలమును తెలుపునదే జ్యోతిషము జ్యోతిష గ్రంథము - స్థలము గృహముగామారు యోగ కాలము వచ్చినదా లేదా? గృహస్తునికి గృహముకట్టు యోగము వచ్చినదా లేదా? అది యెప్పుడొచ్చును, ఆ స్థల శుభాశుభము లేమి. అను విషయముల తెలుపలేని వాస్తుగ్రంథములు గ్రంథములనవలయునో లేదో గమనించుము.

శ్రీ= స్వామి, స్థలము గృహమగుటకు - గృహస్థుడు గృహము కట్టుటకు యే గ్రహములు యెచ్చటికి రావలయునందురు.

గు= నాయనా, నవగ్రహ కేంద్రములనుండి ఈ భూమిపైన ఆ గ్రహమండలము లెట్లున్నవో అదే విధముగ నీడ పడుచుండును. చిన్నవి, గొప్పవి, మరికొంతగొప్పవిగా పడును.- గురుపాలితగ్రహముల నీడకు గురువు, శనిపాలితగ్రహముల నీడకు శని వచ్చినప్పుడు ఆ స్థలము గృహమగును. గురుపాలిత జాతకులకు గురువు చతుర్థమునకు వచ్చినప్పుడు శనిపాలిత జాతకులకు శని చతుర్థమునకు వచ్చినప్పుడు గృహములు కట్టుట, గృహోపకరణముల భూముల కొనుట, కొని రిజిష్టర్లనుపొందుట స్థిరాస్తుల నభివృద్ధిచేయు తలంపు నిచ్చి చేయింతురు.- యే గ్రహముండునో యే గ్రహము చూచుచుండునో ఆ గ్రహముయొక్క మండలాకారమూ స్థలముండును. అక్కడ ఆ గ్రహమునకు సరిపోవు వస్తువు లుండును. - కట్టునప్పుడు దీర్ఘచతుర్కోణముగా గృహము కట్టినను కడకు ఆ మండలాకృతిగా గృహము తిరిగితీరును. ఉదాహరణ= చతుర్థమున కుజుడుండిన చూచిన త్రికోణముగా స్థలముండును. దీర్ఘచతుష్కోణముగా గృహము

కట్టినను కడకు ఆ యిల్లు త్రికోణాకృతిగా మారును.

శ్రీ= స్వామి, చతుష్కోణముగా కట్టిన యిల్లు త్రికోణముగా యెట్లు మారును.

గు= త్రికోణముగానున్న స్థలమును మూలల ఖండించి చతుష్కోణముగాయేర్పరచి గృహము కట్టుకొన్నదానికి యే కోణమునో దానికానించి కట్టుకొను ఉద్దేశ్యముగలిగి కట్టుకొందురు. తప్పదు.

శ్రీ= అట్లయిన ఎట్లు చెప్పవలయు, ఎట్లు కట్టవలయునందురు.

గు= నాయనా, గృహస్తుడు లేక గృహముండదు గృహిణి వుండదుగదా. గృహస్తుని జాతకరీత్యా యెట్టిస్థలము దొరుకవలయునో, యేవిధముగా కట్టవలయునో, యే దిశకు ముఖద్వారముంచవలయునో, పొడవు యెక్కువగా దొరుకునో, వెడల్పు యెక్కువగా దొరుకునో, విశాలప్రదేశము దొరుకునో, ఇరుకుస్థలము దొరుకునో, మంచిస్థలము దొరుకునో, నీచస్థలము దొరుకునో, పాత యిల్లు దొరుకునో, క్రొత్త స్థలము లభించునో, భవనము కట్టునో, వసతి గృహము కట్టునో, సామాన్యగృహము కట్టునో, ఇరుకు ఇల్లు కట్టునో, కట్టినది దొరుకునో, బాడుగ ఇండ్లలో నుండునో, ప్రభుత్వ గృహములందుండునో, ఎన్ని గృహములలో కాపురము చేయువలయునో, ఎన్నిచోట్ల గృహము ప్రారంభించి విడువవలయునో, కట్టి విక్రయించవలయునో జాతకమువందే గన్పడును. వాస్తుగ్రంథములందు గానబడవు. జ్యోతిషులే చెప్పవలయును. జ్యోతిషమే నిర్ణయింపవలయును.

"ఋణానుబంధరూపేణ పశుపత్నీ సుతాలయ"

అన్నారు. వానికెట్టివి ఋణమో అట్టివి గలుగును. వాని జాతకలగ్న చతుర్థమును ఏ గ్రహముచూచునో, ఏ గ్రహముండునో అట్టి యిల్లు అట్టి స్థలము లభించునన్నమాట.

శ్రీ= స్వామి, ఆయము ఆయమనెదరే శాస్త్రజ్ఞులు. మంచి చెడ్డల గమనించుటకు తామేమని చెప్పెదురు.

గు= వత్సా, వెడల్పు యెంతవుండునో అంత రెండున్నర పొడవుండుట ఉత్తమము. రెండంతలు మధ్యమము అంతకు తగ్గిన అధమము వెడల్పు పొడవుకన్నా హెచ్చిన అధమాధమము. - ఇట్లు స్థలము నిర్ణయించుకొనవలయును. రెండున్నరకు పొడవు జాస్తి యుండుటకూడ క్షేమముగాదు.

శ్రీ= స్వామి, వెడల్పు జాస్తివుండిన యేమిచేయవలయును.

గు= రెండుగా గాని, మూడుగా గాని చేసి పొడవు జాస్తి అవునట్లు చూడవలయును.

శ్రీ= స్వామి, గృహము శుభముగానుండుటకు యేమి చేయవలయునందురు.

గు= నాయనా, జాతకానుగుణ్యముగా స్థలము స్థలమునకు యిరుప్రక్కల యెట్టి స్థలములు, యెట్టి యిండ్లు, తలవాకిటికి యెదురిల్లు యెట్టిది, వెనుక యిల్లు యెట్టిది ఆ స్థలము స్త్రీలదా, పురుషులదా ఎందరు భాగస్థులుండినారు. అను ప్రశ్నలకు సదుత్తరము చక్కగా జాతకరీత్యాగాని, తత్కాల ప్రశ్నరీత్యాగాని చెప్పవచ్చును. వాస్తు గ్రంథమువల్ల చెప్పనలవి గాదు. స్థలమాహాత్మ్యము తెలియక ఆ స్థల మాజాతకునకు సరిపోవునది సరిపోవనిది గమనించక వాస్తు చెప్పినట్లు ఆయముపట్టిన శ్రేయముగలుగునా. శంఖులు కొట్టిన ముహూర్త బలము నిలుచునా. గృహమునకు ముహూర్త మెట్లుండవలయుననునది కూడ క్రమబద్ధము గాదు. తిథి వార నక్షత్ర యోగకరణములపై ఆధార పడినారు. శాస్త్రము శూన్యముచేసినారు గొప్పగొప్ప వారిని పిలిచి శంఖుస్థాపనలు ప్రారంభోత్సవములకు చేయించు చున్నారు. తదేవలగ్నం తారాబలమేగాక ప్రకృతము

గ్రహాబలముగాదు. గృహమునకు యే గ్రహము బలముగా నుండవలయును. ప్రాజెక్టులకు యే గ్రహము, కాల్వలకు యే గ్రహము, కోటలకు యే గ్రహము, దేవాలయములకు యే గ్రహము, రోడ్డువేయుటకు యే గ్రహము, భవనములకు యే గ్రహము, విశ్వవిద్యాలయములకు యే గ్రహము స్కూళ్లకు యే గ్రహము యెచ్చటుండవలయునను విషయమెరుగచెప్పని శాస్త్రములుగాబట్టి ముహూర్తములుపెట్టువారేమిచేయుదురు. గౌరవము చెడకుండ యేదో వకటి పెట్టుదురు. ఆ సంకల్పముకూడా అట్లే వుండును.

వెడల్పు, పొడవు జాతకానుగుణ్యముగా చిక్కును. గృహస్తునికి ఎంత పొడవు వెడల్పు కావలయునో తెలుసుకొని స్థలమున్నంతలో టేపుతో కొలిచి, ఈశాన్యమునుండి నైరుతికి ఎంత కొలతవచ్చునో ఆగ్నేయమునుండి వాయువ్యమునకు అదే కొలతవచ్చునట్లు చూడవలయును. అట్లు సమకొలతవచ్చిన అష్టదిక్కులు వచ్చును. నవగ్రహములకు సమానమైన స్థలమేర్పడును. జాతకుని గ్రహబలము బట్టి గృహమున శుభాశుభములుండును. దీనినే శంఖుస్థాపనందురు. మూలల కొలత చక్కగానుండిన శుభమే చేకూరును.

శ్రీ= ఒక గృహములో గదులు కట్టుదురుగదా. అవి ఎట్లుండవలయునందురు.

గు= ఏగదికాగది మూలల కొలతలు సమముగా నుండుట క్షేమము - తలవాకిటినుంచి దొడ్డివాకిటి పర్యంతము వక ప్రక్క గదులుండి మరొక ప్రక్క లేకుండ వుండరాదు. కుడియడమల గదులు, కిటికీలు, వాకిండ్లు సమానముగా నుండుట శుభము.

శ్రీ= గదులలో ఒకటి పెద్దది ఒకటి చిన్నది వుండవచ్చునందుర.

గు= ఉండవచ్చును. ఏ గదియైన కుడియెడమల గమనించి కట్ట వలయును. ఒక ప్రక్క బరువుండరాదు. సమాన కొలత వుండుట శ్రేయము. ఒక ప్రక్క కిటికీ, ఒక ప్రక్క గూడు పెట్టరాదు ఇరుప్రక్కలనుండుట శ్రేయము. ఒకప్రక్క గది కట్టి మరొకప్రక్క లేకుండుట అశుభము. సంసార మునకు ప్రతిదీ రెండుగా నుండవలయును. ఒక్క రోలు, ఒక్క చేట, ఒక్క పార, ఒక్క పొయ్యి, ఒక్క రోకలి, ఒక్క మంచము, ఒక్క కంచము, ఒక్క చెంబు, ఒక్క గ్లాసు, గృహోపకరణములు ఒక్కటిగానుండరాదు. అశు భముల చేకూర్చును. రెండుగా చేకూర్చుకొనవలయును.

శ్రీ= ఒంటి స్తంభము, ఒంటి దూలముతో కట్టుదురు. దీని నేమందురు.

గు= వత్సా, ఒంటి దూలము, ఒంటి స్థంభమున్న గృహములో భార్యాభర్తలలో నొకరు రోగగ్రస్తులయ్యో, శోకగ్రస్త లయ్యో, దూరగ్రస్తులయ్యో, కడకు నేరగ్రస్తులయ్యో చెడిపోవుదురు. సంసారము భిన్నమగును. లేక భర్త ఇరు వురి స్త్రీలతో కాపురమైనా పెట్టును. ఒంటరిగానైనా వుం డును. అపనిందలు అపవాదులకు నెలవైయుండును. విధ వలకు విధురులకు ఆలవట్టుగా తయారగును దుఃఖములకు నెలవగును.

శ్రీ= చూపుడు దూలమని, చూపుడు స్థంభమని ఏదో వగ సన్న కొయ్యను పెట్టుదురే. శుభ మేనందుర.

గు= చూపుడు దూలము చూపుడు స్థంభమున్నట్లు చూపుడు మనిషి వకడు తయారగును. సుఖదుఃఖముల పంచుకొంటూ కొంప చెరచును. నిరంతరము ఆ యింట కలహముండును. సుఖము కొరకై దుఃఖించు వారుందురు అశుభములకు నెలవగును.

శ్రీ= స్వామీ, తూర్పు పడమరలకు - ఉత్తర దక్షిణములకు రెండు వాకిండ్లు సౌకర్యమునకై పెట్టుకొనివున్నారు. కట్టుచున్నారే శుభమేనందురు.

గు= వత్సా, ఇంటివారుగాని ఇతరులుగాని తూర్పువాకిటవచ్చి పరమటివాకిట పోవుట, ఉత్తరపువాకిట వచ్చి దక్షిణము వాకిట పోవుట తటస్థించును. కాకి దూరిన పుణ్యాహవాచనముతో అశుభము పోవునుగాని క్రూరులు, కుచ్చితులు, విధవలు, విధురులు, అసూయాగ్రస్తులు పోయిన కొంప కూలును. గాన దొడ్డివాకిట మానవుడు పోకుండ గోడ పెట్టుకొని లోదొడ్డిగా చేసుకొనిన అశుభముండదు లేకున్న ఆ వంశస్థులు 120 యేడులకు లోపలనే గృహము విడచుటో, విక్రయించుటో, పదభ్రష్టులైపోవుటో సంభవించును. మానవునికి ఆహారము తీసుకొనుట మలరూపమున విడచుట వున్నట్లు గృహమునకుండరాదు. రెండు ద్వారములుండుటచేత మానవునకు కడుపు నిండనట్లు గృహమునకు ముఖ్యాంగమగు ధనము ధాన్యము నిలువక తక్కువగుచునే వుండును. గృహము గృహస్థుని ఆకృతి గాబట్టి తలవాకిట ప్రవేశించినవారు తలవాకిటనే పోవలయును దొడ్డివాకిట పోరాదు. అశుభ దేవతకు నిలయమగును.

శ్రీ= స్వామి, గృహమునకొక చెంపనమాత్రము అరుగు వేయుదురు. మరొక చెంపున అరుగుండదు. దీనినేమందురు.

గు= వత్సా, ఆయింట రోగులుగాని, విధవలుగాని మానవులుందురు నిత్యకలహములుండును. గృహమునకు అంగవిహీనమగును గాబట్టి, అంగహీనులు రూపహీనులుగా మారుదురు. - మానవునకుగాని, పశుపక్ష్యాదులకుగాని ఒక భాగమున అంగము లేవున్నవో మరొక భాగమున అవియే వున్నవి. ఒకభాగమెంత బరువు లావు పొడవు

వున్నదో మరొక భాగమున అంతే వున్నవి. కొంచము లావులోగాని పొడవులోగాని యెక్కువ తక్కువలు గలిగిన సుఖములో కొరత గలుగుచుండును. అట్లే గృహమునకు ఒక భాగము లోపించిన అశుభముగలుగును. గృహములో ఒక ప్రక్క గరిశవుండిన మరొక భాగమున వుండవలయును. గదులు, కిటికీలు, అలమార్లు, గూళ్లు మొదలగునవి ఇరు వాగుల నొకేవిధముగా నుండుట క్షేమము. జాతకాను గుణ్యముగా కొన్ని గృహములకు కుదరవు. కుదరని లోపము చూపించుచుండును.

శ్రీ = స్వామి, వసారాలో ఒకచెంపన గది నేర్పరచి మరొక చెంపన వేయకుందురే. దాని శుభాశుభములేమి.

గు = తూర్పు వసారాలో అగ్నిమూల గది నేర్పరచిన పశు నష్టము, స్త్రీలవల్ల కష్టము, స్త్రీ దుఃఖము గలుగును. స్త్రీ సంతతి యెక్కువై వారితో కష్టములు పడవలసి వచ్చును.

ఈశాన్యమూల గది నేర్పరచిన ధనలోపము గలుగును. లేదా ధనముండిన లోభులను అపకీర్తి గలుగును. కడకు సర్వనాశనమగును. స్త్రీ దుఃఖముండును.

దక్షిణము వసారాలో అగ్నిమూల గది తూర్పు అగ్నిమూలలో గలిగెడి దుష్ఫలమే గలుగును. నైరుతీ మూల గది కట్టిన గృహములో యెల్లప్పుడు దొంగలుందురు. చోరభయము గలుగును దొంగలవల్ల నష్టము గలుగును. దొంగలను నామధేయమేర్పడును. కడకు స్త్రీ దుఃఖమేర్పడును. నీచుల జనన మేర్పడును. 100 యేడులకు వంశము నశించును.

పడమట వసారాలో నైరుతిన గది గల్పించిన దక్షిణామున నైరుతి గది ఫలమే గలుగును. - వాయువ్యమున

గది గల్పించిన తల్లిలేని పిల్లల గల్పించును అజ్ఞానుల సృష్టించును. లేదా విపరీతజ్ఞానుల సృష్టించి కొంపను దుంపదెంచును. కడకు వంశ వృక్షమును నాశనమొనర్చును. శిరోభాగమున వ్యాధుల గల్పించును. - ఉత్తరమున వసారాలో, తూర్పు వసారాలో ఈశాన్యమున ఫలమేదో అదే గలిగించును.

శ్రీ= స్వామీ, ఈశాన్యమున (జాస్తి) ఎక్కువ వుండవలయునన్నారే నిజమ.

గు= వత్సా, నవగ్రహములకు సమానమైనస్థలమే ఇవ్వవలయును గాని వకరికి యెక్కువ యివ్వరాదు. అట్లయిచ్చిన దిక్పతి పాపియైన యెక్కువ పీడించును. శుభగ్రహమైన కొంత నయముగానుండును. ఆ దిశన చీలుటో ఊదుటో పడిపోవుటో నిశ్చయము. ఏ దిశాధిపతికి యెక్కువ వుండరాదు.

శ్రీ= స్వామి, అష్టదిక్కులు వచ్చునట్లు చక్రము వేసి చూపుడు. అష్టదిక్కులు సమముగానుండవలయునన్నారుగ.

గు=

| | | |
|---|---|---|
| నైరుతిమూల | పడమట | వాయువ్యము |
| దక్షిణం | ధృవము | ఉత్తరం |
| అగ్నిమూల | తూర్పు | ఈశాన్యము |

ఇట్లు దిశలు యేర్పడును. భూమట్టమున యే కొలతగలదో ఆ కొలతయే పైభాగమున నుండవలయును. అట్లులేక తక్కువకొలత వచ్చిన వంశవృక్షమును తగ్గించును. బుద్ధిహీనుల పుట్టించును. ఎక్కువుండిన శిరోవ్యాధుల గలిగించును. విపరీతజ్ఞానుల గాని, అజ్ఞానుల గాని పుట్టించును. బంధుమిత్రాదులవల్ల పరివారమువల్ల భోజనఖర్చుల విప

రీతముగ గల్పించును. క్రిందికోలత యెంతో పైకోలత అంతే వుండవలయును. పై భాగమునకు చంద్రుడధిపతి గాబట్టి, చంద్రుని కారకత్వములు నశించును.

శ్రీ= స్వామీ, పై కోలతలో వలయాకారము గల్పింతురు. (రవుండు) కిటికీలకు వాకిండ్లకు వసారాలకు ముందు భాగము పైభాగము వ. యాకారమగుటవల్ల సత్ఫలమా, దుష్ఫలమా.

గు= వత్సా, శృంగారముగానుండవలయునని చేయుదురు దాని వల్ల నష్టము కష్టము సంప్రాప్తించును. తలలో, బుద్ధిలో జబ్బులు గల్పించును. విపరీతజ్ఞానుల పుట్టించును. చెవుడు పిచ్చిని గల్పించును. ముఖాలంకారము చెరచును. దూర దేశములకు పంపును. వంశవృక్షమును నశింపుచేయును. కాలచక్రములో కటకమునకు శని 30 యేండ్ల కొకసారి వచ్చును అప్పుడు ఆ గృహమును నశింపుచేయచూచును. శుభగ్రహ బలమువల్ల విలుపడకపోయిన 60 యేడులలో చూచును. అదీగాకపోయిన 90 యేడులలో చూచును. శుభగ్రహవీక్షణవల్ల అక్కడగాకపోయిన 120 యేడులలో నశింపుచేయుటో, విక్రయము చేయించుటో, వంశవృక్షమునే పదభ్రష్టము చేయుటో, పడగొట్టుటో చేయును. బుద్ధిహీనులు పుట్టి విపరీతముగా ధనవ్యయముచేసి, ఋణపడి విక్రయించుట తప్పదు. గృహములోగాని పొట్లలో గాని వలయాకారము త్రిప్పికట్టినను, కోలతలు తక్కువచేసి కట్టినను, తలవాకిలి కిరుప్రక్కల మరుగుదొడ్లు బావులు కొళాయిలు వలయాకారముగా కట్టడములు కట్టినను, అష్ట దిక్కులలో యే దిక్కునుగాని వలయాకారముగ త్రిప్పినను గృహ భూభాగములో గదులు కల్పించినను పైన చెప్పినవి జరుగును. నిర్ధనికులైగాని సంతతిలేకగాని చెడును.

శ్రీ= స్వామి, యే దిక్కున వలయాకారముత్రిప్పిన ఎట్టి విపత్తులు

గలుగునో తెలుపుడు.

గు= అగ్నిమూల వలయాకారము త్రిప్పిన అండవాయువులు (హార్నియా) పొత్తికడుపులో శూల వీర్యనష్ట వ్యాధులు స్త్రీలు దుఃఖజీవులుగా మారుట, వివాహములకు ఆటంకములు, పశు నష్టము, వాహన గండము, స్త్రీలు పురుషులు వ్యభిచారిణులగుట కామబాధకు బలియగుట, ఆగ్నేయమున గృహము నగ్గుట చీలుట ఊడుట సంభవించును.

నైరుతీమూల వలయాకార ఫలము - ఇంటివారే చోరులుగానుండుట, చోరబాధలు గలుగుట, సర్పములు గానవచ్చుచుండుట, క్రిమికీటక బాధ మెండుగానుండుట, దొంగతనముచేయువారని పేరుగలుగుట, అపకీర్తుల పాలగుట తటస్థింపచేయును.

వాయువ్యమూల వలయాకారము గలిగిన - క్షయ వ్యాధులు, మేహరోగులు పుట్టుదురు. శ్వాస కాసలు గలుగును వీర్యనష్ట వ్యాధులు, అజ్ఞానులు విపరీతజ్ఞానులు శిరో వ్యాధులు, సన్నపిల్లలకు జబ్బులు, విడువని పడిశములు చూపెట్టివుండును.

ఈశాన్యమున వలయాకారము గలిగిన - ధనవ్యయము, ధనికులతో కలహము, పుత్రసంతతికి హాని, అకాల మరణములు, పుత్రులు దుష్టులై చింత పుత్రులతో కలహము, ధనము దుర్వ్యయము, బ్రాహ్మణ ద్వేషము, దైవ దూషణ గలిగి, గ్రామములో పలుకుబడి నశించి సర్వ దారిద్ర్యములనుభవింతురు. వంశము దెబ్బతినును.

శ్రీ= స్వామి, పలుమూలలు సక్రమముగా నుండనియ్యక తగ్గించి కొందరు, జాస్తి చేసి కొందరు, ఒక చెంపన వసారావేసి కొందరు, ఒకమూలన ఇంటికానించి గదిని నిర్మించి కొందరున్నారు. ఇవి గృహమునకు హానికరమేనందురు.

గు= వత్సా, గృహము దీర్ఘచతుష్కోణము గలిగినది. ఎట్లన. ఖగోళమున గురుమండలము దీర్ఘచతుష్కోణము గలిగినది. గురువు గృహాధిపతి - అందుచేత గృహము దీర్ఘచతుష్కోణాకృతి చెడకుండ వుండవలయును. ఒకమూల ఇంటికా నించి మరొక గదిని కట్టుటగాని, వక చెంపన షోపా వేసినగాని, నలుమూలలు చెడి అయిదు మూలలగును. దీనినే ఆయము చెడినదనుచున్నారు. - ఏ మూల హెచ్చినదో ఏ మూల తగ్గినదో ఆ కోణాధిపతివల్ల విపత్తులు తప్పవు. జ్యోతిశ్శాస్త్రమున కోణాధిపతులెంత ముఖ్యప్రాణమో గృహమునకు మూలలంత ముఖ్యము. చతుష్కోణమనగ నలుమూలలు ఎక్కువ తక్కువ లేకుండునది. సమ చతుష్కోణము దీర్ఘచతుష్కోణమని రెండు విధములు సమ చతుష్కోణ మండలము చంద్రునిది. సమ చతుష్కోణముగ గృహస్తులు కట్టుకొని భరించలేరు. విపరీతమైన ఖర్చుల తెచ్చును. రాజులవలె జీవింపవలయునను బుద్ధిని గలిగించును. విలాసములపై బుద్ధిని యీడ్చి ధనము దుర్వ్యయము చేయించును. దాస దాసీజనుల శక్తికి మితిమీరి గలిగించును. రాజఠీవితో జీవింపచేసి ఆదాయముకన్నా వ్యయము యెక్కువ గలిగించి తొందరగా నశింపుచేయును. రాజులకు తప్ప రైతులకు వ్యాపారస్తులకు పనికిరాదు.

శ్రీ= నలుమూలలకు అధిపతులు నవగ్రహములలో ఎవరుస్వామి.

గు= ఈశాన్యమునకు గురువు కేతువు, ఆగ్నేయమునకు శుక్రుడు, నైరుతికి రాహువు, వాయువ్యమునకు చంద్రుడు ఈ గ్రహములు పాపులై చతుర్థమునందుండిన ఆయా మూలలు యెంత భద్రముగ కట్టినను తప్పక సగ్గుటో, చీలుటో, ఊడుటో తప్పదు పూర్వులు ఈశాన్యమునకు బుధుని, ఆగ్నేయమునకు చంద్రుని, వాయువ్యమునకు కేతువును వేసిరి. ఈ గ్రహములు పాపులై చతుర్థము

నందున్న ఈ మూలలు నశింపుగాక పైన చెప్పిన మూలలు నశింపగును గమనింపుము.

నలుమూలలలో యే మూల చెడునో ఆ గ్రహము విపరీతఫలమిచ్చును. ఆ గ్రహకారకత్వములతో నశింపు చేయును. శుభమైన సత్ఫలమొసగును గాన నలుమూలలు క్రమబద్ధముగా నుండవలయును.

శ్రీ = స్వామి, దక్షిణదేశమున బీదవారు చుట్టిల్లు అని గుండ్రముగా కట్టుకొందురు. - గుండ్రము (వలయాకారము) పనికిరాదని చెప్పిన హరిచక్రాయుధమువలె, ఎండకు చత్రమువలె వలయాకార గృహము మానవుని కాపాడునని ప్రత్యుత్తరమిత్తురు. నిజమేనందుర.

గు = నాయనా, పూర్వులు బీదవారుగాబట్టి ఖర్చు తక్కువగా ఇల్లు కట్టుకొనునట్లు చేసిరి. వలయాకారముగా గోడకట్టి ద్వారబంధ మమర్చి మధ్యలో (నిట్రాయి) స్థంభ మమర్చి కప్పువేసిరి ఇది సులభోపాయము ఇది చుట్టిల్లు. చతుష్కోణముగల ఇంటికన్నా వేయిరెట్లు మంచిదని సూర్యుని చక్రాయుధమును ఉదాహరణకు చూపించినారు దానితో ఆ ప్రాంతమువారు భవనము కట్టినా దాని ప్రక్కనే వక చుట్టిల్లు కట్టినారు - వత్సా, వలయాకారము సూర్యమండలము ఆ యాకారముగా యేదీ కట్టరాదు. ఎందుకనగా సూర్యుడు త్రిమూర్తి స్వరూపుడు, ధర్మాత్ముడు, తేజోనిధి, కర్మసాక్షి. - ఆ మండలాకారమున్న గృహమున మానవుడుండుట కష్టము. అధర్మముల అన్యాయముల సహింపక నాశనమొనర్చును గాన గుండ్రముగా యేది కట్టరాదు కోటలు బురుజులు కొన్ని గృహములు కట్టిరి. త్వరగా నశింపైరి శావులు చతుష్కోణముగా కట్టిన, కట్టినది నిల్చుట కష్టమని తలంచి గుండ్రముగా కట్టిరేగాని చతుష్కోణమే శ్రేయము.

శ్రీ= అయిన, తూర్పుదిశ వాకిలికూడ బాధితమేనందురా.

గు= అవును. తూర్పు దక్షిణముగల తలవాకిండ్లు చాలామంచివే గాని. ఈ వాకిండ్లలోగలవారు సూర్యోదయమునకుముందే నిద్రలేవవలయును. ధర్మప్రవర్తన ఇంతో అంతో కొంత వరకైన వుండవలయును. దైవారాధన దయాదాక్షిణ్యము సత్ప్రవర్తన గలిగి ప్రవర్తించవలయును. మాతృ పితృ గురుదేవ బ్రాహ్మణ సాధు సజ్జన గో వృద్ధులయందు భక్తిగలిగి వారి దీవనలను పొందవలయును అట్టివారుగా నుండవలయును. సూర్యునారాధించవలయును. లేకున్నచో తొందరగా ఇల్లు మారుటో దినదిన క్రమేణ దుర్దినములు తటస్థించుటో తప్పదు ఎందుకనగా తూర్పుదిశకు దిక్పాలకులలో ఇంద్రుడు, నవగ్రహములలో సూర్యుడు అధిపతులు. ఉదయమే సూర్యరస్మి గృహములోపడును. గృహస్తుడు, గృహిణి అంతకుముందే నిద్రలేచి దినకృత్యములు తీర్చుకొని, సూర్యుడుదయించగనే నమస్కరించు వారి నాశీర్వదించును. దినదిన ప్రవర్తమానముగా పెరిగి, సర్వవిధ సౌఖ్యములు పొందగలుగుదురు. వ్యతిరిక్తముగ నడచిన అశాంతిగలుగును - దక్షిణమునకు యముడు కుజుడు అధిపతి ధర్మప్రాదయులు పాపపుణ్యముల విచారించువారు, నియమనిష్ఠలు గలవారు, ఆ దిశకు వాకిలిగలిగిన వారు పై లక్షణములు గలిగివుండవలయును. వ్యతిరిక్తులైన అశుభములు చేకూరును.

శ్రీ= పశ్చిమోత్తరముల వాకిండ్లు శుభమనదరా.

గు= అవును. పశ్చిమమునకు శని, ఉత్తరమునకు బుధుడు అధిపతులు. - వీరు వామాచారులు, జీవహింసాకారులు. మానవులు ఎంత నీచమగు కార్యములుచేసిన అధర్మప్రవర్తకులైన కొంతవరకు సహింతురు తూర్పు దక్షిణములకు అహింసాకారులు భూతదయా పశ్చాత్తాపము గలవారు

గావున జీవహింసచేసిన అన్యాయ ప్రవర్తకులైన గృహములోగల వారిని రోగగ్రస్తులుగానో, శోకగ్రస్తులుగానో చేసి సుఖములేకుండ చేతురు. సుగుణ సంపత్తిగలవారికి తూర్పు దక్షిణములు శ్రేయము.

శ్రీ= ఒంటి స్తంభము, ఒంటి దూలము వుండకూడదన్నారే, నిజమేనందురా.

గు= ఔను. ఒకటి గృహమునందేదైనను ఉండుట శ్రేయస్కరముగాదు. జంటతో కూడుకొన్నది సంసారము గాన వక్కటి అశుభసూచకము జంటగానుండుట క్షేమమన్నారు. సప్తమ చతుర్థములందు పాపగ్రహములున్న వానికి వక్కొక వస్తువుండుటయు గృహములో ఇరుగుచూపినవి, పిప్పి పట్టినవి, వక్రగతి పట్టినవి, చీలినవి, నొక్కులు పోయినవి, ముక్కలుపోయినవి, నచ్చోకముచెడినవి క్రొత్తవిగా తెచ్చినను చక్కగా వుండక చెడిపోవును. చతుర్థ సప్తమముల పాపగ్రహములున్న వానికి ఇట్టివి లభించును యేకము వఁవి వనికిరావు - భార్య వకటే, వాహనము వకటే, బండి వకటే, సైకలు వకటేగద వనువారుండకపోరు భార్య భర్త వాహనము గృహస్తుడు. గృహస్తుడు లేక వాహనము లేదు. అన్నీ గృహస్తునితో రెండగును గాన దోషము లేదుగాని గృహములోనున్న వస్తువులందు రెండుగానుండుట క్షేమము - ఒక రోలు, ఒక మంచము, ఒక కంచము కడకు చేట పొరకకూడా ఒకటి వుండరాదు. గదులులేని గృహము స్నానాలగది, వంటగది, దేవునిగది, లోదొడ్డి కక్కసు లేనిగృహములు చతుర్థశుద్ధిలేనివారికి లభించును.

శ్రీ= విపరీతమనగానేమి స్వామి

గు= అనగా ఒకటుండవలసినచోట యెక్కువగానుండుట. ఒక భార్యవుండవలసిన జీవన్యాయముదాటి ఇరువురు భార్యలు

పైన వుంవుడుకత్తెలు వుండుట, శక్తికి మితిమీరిన పనులు చేయుట, శక్తికిమించిన యిల్లు, అక్కరకురాని పనులు చేయుట, ఎక్కడి వస్తువుల అక్కడే విడచుట, ఎక్కువ మాట్లాడుట విపరీతమనెదరు పంచమ చతుర్థముల పాప గ్రహములున్న ఇట్లుండును క్రమము దాటిపోవుటను విపరీత మందురు. ఒక వస్తువు సరిపోవుచోట నాలుగు వస్తువుల చేరవేసిన విపరీతమందురు

శ్రీ= దూలము స్తంభము లేక దంతెలతోనే యిల్లు కట్టుదురే, శుభమేనందుర

గు= దూలము స్తంభము లేకపోవుట విరుద్ధమైనను కొంతకాలము పరవాలేదు అటుపై భార్యాభర్తలుగాని వారి సంసారములు తటస్థించును. అక్క తమ్ముడు, అన్నా చెల్లెలు, వదినా మరిది జీవన్యాయముగాని సంసారముల పెట్టును. బాడిగయిండ్లగా మార్చునుగాని, ఒంటి స్తంభము ఒంటి దూలమున్నంత కీడును తెచ్చిపెట్టదు.

శ్రీ= చూపుడు దూలమని చూపుడు స్తంభమని ప్రక్కన వకటి పెట్టెదరే, దీనినేమందురు.

గు= ఇది మరింత విపత్తుల గల్పించును. ఆయింటికెవ్వారు యితరుల పురుషుడుగాని, స్త్రీగాని చూపుడు మనుషులుండి విపత్తుల గల్పించుచుందురు. పరుల ఆలోచనతో పాడగుదురు. విపత్తుల పాలగుదురు. ఆ యిల్లు వురికొనదు. - 1, 3, 5, 7, 9 బేసి సంఖ్యలతో గృహాస్తుడు యేదీ నిర్మించుకొనరాదు. అన్నీ జంటలుగానే వుండుట శ్రేయము.

శ్రీ= స్వామి, కొన్ని గృహములకు లోదొడ్డి దంసిగా నుండి కాయగూరలు పండించుకొందురు. పూల చెట్లు, తులసి మొదలగునవి వేసుకొందురు. ఎంతో ఆనందింతురు. పూసిన పూలు, తులసీదళములు కోసి దేవునికొపెట్టి నమ

స్మరించి దైవబలము సంపాదింతురు. యే గ్రహబలము వల్ల నందురు.

గు= వత్సా, లగ్న చతుర్థమున నవమాధిపతి బలవంతుడైయుండిన వారికి సర్వవిధముల గృహావసతి కలిగించి సర్వశుభముల చేకూర్చును. పుణ్యమార్జింపచేయును - కుజుడు శుభుడై చతుర్థము నందుండిన వృక్షములతో చెట్లతో కూరగాయలు, పూలు, పండ్లు కాయు చెట్లతో గృహమును శోభాయమానముగా చేయును. ఆదాయము, అలంకారము కలిగించును - పాపిష్టుడై యుండిన యిందుకు వ్యతిరిక్తముగా చేయును. నశింపచేయును. - రవి చంద్రులుండిన చతుర్థమున రాజఠీవిగా సకల సౌకర్యములతో గృహము కుదిరింతురు - గురువుండిన సకల సౌకర్యములు గల గృహముతో వేద వేదాంగ విద్యాపారంగతులతో గృహము కలకలలాడించును - శుక్రుడుండిన విలాస వినోదములతో వాహన సౌకర్యములతో నవయౌవన సుందరాంగులతో మానవుని సుఖింపచేయును. ఇట్లే శని బుధ రాహువు కేతువులు గల గృహాలుండును గాని వసతిగల గృహములలో సౌకర్యముగల స్థానములలో అన్ని హంగులు కలిగిన స్థలములలో నుండజేయజాలరు. ధనము మాత్రము చేకూర్తురు. పాపులైనచో నాశనము. సప్త వ్యసనములతో వినాశనము చేయుదురు.

శ్రీ= గాలి వెలుతురు కొన్ని గృహములకుండును. కొన్నిటి కుండవు. కారణమేమందురు.

గు= వత్సా, సూర్యుడు వెలుతురుకు చంద్రుడు గాలికి కారకులు గాన వీరు పాపులైనవారు గాలిని వెలుతురును పొందజాలరు. శుభులైనవారికి కొదువగలుగదు.

శ్రీ= స్వామీ, ఒకరికి ఒకటి మొదలుకొని యేడవయింటి పైన

గృహములుండును. ఒకరికి గృహమేవుండదు. కారణమే మందురు.

గు= చతుర్థమున లగ్న పంచమ నవమాధిపతులు గలవారికి గృహములకు కొదువుండదు. గృహ కారకుడైన గురువు శుభుడై పంచమ లగ్నాధిపతులతో కలిసియుండిన బలాను గుణ్యముగా పదికిపైన గృహములుండును. వాటి అద్దెలు జీవనోపాదులకు పోను మిగులును. నవమాధిపతి గురువుతో కలిసి చతుర్థమునందుండిన ముప్పై నలభై యిండ్లుండును. వాటితో గొప్ప ఆదాయకరముగా నుండును. విలువైన విగా నుండును.

చతుర్థమున బలముగా నొక పాపగ్రహమున్న యెడల యెంత ధనికునికైన వసతిగల గృహమే వుండదు. వుండిన నాశనమైనది, కట్టిన వెంటనే ఇతరులపాలైనది, అనేకులు నివాసముచేసి విడచినది, చతుష్కోణము లేనిది, సందు గొందులలోన గాలి వెలుతురు లేనిది, గ్రామ అంచులలో నుండునది, ఇరువాగుల సులస్తులు లేనిది, అన్య జాతీయులతో బాధాకరముగా నుండునది, శిథిలగ్రస్తముగ నుండునది, దయ్యములు - భూతములున్నవని వాడుకగలిగినది, పై కప్పు సరిగా లేనిది, గోడలు వూడుకొని యుండునది దొరుకును - చాలి చాలనిదని వసతిలేనిదని బజారు లేనిదని చింతింపచేయును. క్షేమముండదు.

శ్రీ= స్వామి, ఒక్క గృహమున రోగబాధ, మరొకయింటిలో సోదర సోదరీ కలహము. మరొకరింటిలో శత్రురోగ ఋణ విపత్తులు ఇంకొకయింటిలో పుట్టినపిల్లలు బ్రతుకరు. దీని నేమందురు.

గు= వత్సా, చతుర్థము గృహముగదా. చతుర్థమున షట్ స్థానాధిపతి వుండిన శత్రురోగ ఋణవిపత్తులు గలుగుచుండును. అందులో పురుషగ్రహమైన పురుషులవల్ల, స్త్రీ

గ్రహమైన స్త్రీలవల్ల కలహములు గలుగుచుండును. చంద్రుడు పాపియైన సన్నపిల్లలతో, పాడి పశువులతో, తల్లి లేని పిల్లలతో దుఃఖింప చేయును. బుధుడు పాపియైన మాతులన్యాయముగల వారివల్ల సేవకులవల్ల కలహములు మనస్తాపములు గలుగుచుండును. సోదరకారకు డుంటిన సోదర సోదరీ కలహములుండును. అష్టమాధిపతి వుండిన వంశక్షయమే యగును. పుట్టిన పిల్లలందరు గతింతురు. గృహస్తునికి కారాగారము తప్పదు. ద్వాదశ స్థానాధిపతి యుండిన సర్వము వ్యయమగును. ఈ గ్రహములు శుభ గ్రహములైయుంటిన యోగప్రదముగానుండును. (ఉదాహ) వృషభ తుల లకు శుక్రుడు షష్టాష్టమాధిపతియైనను లగ్నాధిపతి గాన శుభప్రదుడై సుఖింపచేయును. అశుభముల చేకూర్చడు. ఇట్లే ద్వాదశలగ్నముల శుభాశుభత్వముల నెరుంగవలయును. చతుర్థము బ్రహ్మస్థానము. ఈ స్థానమున లగ్నపంచమ నవమాధిపతులున్న వారే ధనికులై, విద్యాధికులై, ఉన్నతోద్యోగులై, భూస్వాములై సర్వసౌఖ్యములనుభవించుచున్నారు

శ్రీ= స్వామి, పుట్టినటయము లేకున్నను వచ్చినకాలమునుబట్టి పృచ్ఛకుని గృహమును భూత భవిష్యత్ వర్తమాన సుఖ దుఃఖముల తెలుపవచ్చునందురా.

గు= నాయనా, పుట్టిన టయమునకు వచ్చిన టయము సరిపోకుంటిన ప్రశ్న చెప్పవలెను. ఇది విధివిధానము. ప్రశ్న ద్వారా చెప్పగలశక్తి దైవజ్ఞునకుండిన సర్వము తెలుపవచ్చును.

శ్రీ= గృహము కట్టుటకు ముందు ఆ స్థలము ఇట్లుండెనని చెప్పుచున్నారే, అదెట్లు చెప్పనగును.

గు= శ్రీవత్సా, చతుర్థమున సూర్యుడుండినను చూచినను, ఆ స్థలము అన్నిరంగులుగల మట్టిగానుండును. గ్రామనైర్ఋతము

ధర్మకార్యములు చేయునది బంజరు గుండము అగ్నితో కాలినది శివాయిజమ ఇట్టిదిగానుండును. ఇల్లు వేయగా తూర్పుభాగమున మిగులు స్థలముండును. బాముగా గ్రహముండిన మహాడీతో కూడిన భవనమగును. అశుభుడైన ఆక్షేపణ, ప్రభుత్వముతో బాధ, అగ్నితో నష్టము, తూర్పుదిశనుండు వారితో కలహాములు తటస్థించును. ఇంటి స్థలమెట్లో భూములదగ్గర యిళ్లే వుండును. ఆ స్థలము గుండ్రము గాని, తూర్పు భాగము వలయాకారముగా గాని వుండును. చతుష్కోణము చక్కగానుండదు శుభుడైన సర్వతోముఖముల శుభముల చేకూర్చును. అశుభుడైన సర్వవిధముల నాశనమొనర్చును.

చతుర్థమున చంద్రుడుండినను చూచినను ఆ స్థలము తెల్లటి మట్టిగా నుండును. ఆ స్థలము నీరు పొలము పోవునదిగా, తగ్గుపట్టుగా, మళ్లు సాగునదిగా, వంక పోవునదిగా నుండును. మహాడీ వేయు స్థలమగును విలాసమందిరమగును. చతుష్కోణమై సర్వశుభముల చేకూర్చును. పాపియైన చతుర్థమందున్న వీధి కెదురుగా (వీధిచూలు) నీళ్లు నిల్చు పెద్ద తగ్గుగా, వీధియెత్తు స్థలము తగ్గుగా, పూర్వము మాయ ముంతలు బూడ్చు స్థలముగా, పూర్వము వాయువ్య మూలలో బావిగా కాలువగా, నీళ్లుపోవు దారి కెదురుగా చుట్టుప్రక్కల యిండ్లు లేనిదిగా, తల్లిలేనిపిల్లలు మైనర్లుగలదిగా, గ్రామస్థుల ఆక్షేపణ గలదిగా, వాయువ్యమునకు వాలు గలదిగా, మహాడీ నీడ పారునదిగా నుండును. అశుభముల చేకూర్చి మైనర్లకు పుంజీ లేకుండ చేయును.

చతుర్థమున కుజుడుండిన ఎఱ్ఱటి మట్టితో త్రికోణాకారముగా స్థలముండి అందులో చెట్లు రాళ్లు మొద్దులు వుండును. భూమిలో యెర్లుండును. గింజలుపోయు కణజములుండును. పూర్వము దేవతావృక్షము వుండునదిగా,

పదిమందినూరొ్చును రచ్చటసుగుగా, చెట్టునీడ పారునదిగా నుండును. శుభుడైనచో గృహము కట్టుకొనగా యింకా స్థలము మిగులును. ఫల వృక్షములతో పూల చెట్లతో గృహము కలకలలాడుతూ, దినదినాభివృద్ధిగా పదిమంది యువకులు గలిగి సుఖింతురు.

అశుభుడైన ఆ స్థలములో దారివుండును. చెట్టు కొట్టిన గుంత గలదిగా, మొండిగోడలు గలదిగా, రాళ్ల తెట్టెలు, గుంతలు, చెట్లు, బండలు గలదిగా ఆక్షేపణ దక్షిణమునకు వాలు గలదిగా, దక్షిణమున మోటు తిరుగునదిగా (ఇరుప్రక్కల దారిగలిగినది) నుండి అశుభముల గలుగజేయును.

చతుర్థమున బుధుడుండిన, చూచిన వైద్యులు యంత్ర మంత్ర తంత్రములుచేయువారు, వ్యవహారములు నేర్పువారు, వ్యాపారము చేయువారు, మాతులన్యాయము గలవారు, వామాచార బలిపెట్టు చోటుగా, దిగదీసి పారవేయు చోటుగా నుండును. శుభుడైయున్నచో అధికార గౌరవమర్యాదలతో గృహస్తులు జీవింతురు. ఏదో వకటి ప్రజలకుపకరించు విద్యాబలముండును. – స్థలము కోణాకారముగ నుండును. పాడుస్థలముగా, దిబ్బలు మలమూత్రవిసర్జన స్థలముగా నుండును. భూతములు సంచరించు స్థలముగా నుండును. వామాచార బలిపెట్టెడి స్థలముగా నుండును. మఱ్ఱి జావ్వి జమ్మి మొదలగు భూతనివాస వృక్షములుండినచోటుగా నుండును.

చతుర్థమున పాపియై బుధుడుండినా, చూచిన మాతుల న్యాయముగలవారితో బాధ, జ్యోతిష్యులవల్ల మంత్ర యంత్ర తంత్రములవల్ల ధన వ్యయము, భూతభయము, వ్యావహారిక చిక్కులు – వైద్యవిధానములతో, భూత చికిత్సకులతో ధనవ్యయము, స్థలమునకు తగాదా

ఉత్తరభాగమునగలవారితో బాధ, దుఃఖజీవులతో కొంత కాలమునకు నశింపగును. సాధువులై, సన్యాసులై, సంధి చేయు మనుష్యులై, దాస్యజీవనులై పోవుదురు

చతుర్థమున గురుడుండు స్థలము దీర్ఘచతుష్కోణ ముగా తెల్లటి మట్టితో దేవతామందిరములు, బ్రాహ్మణ గృహములు సమీపముగా దేవతావృక్షముల సమీప ములో శుభస్కరమై గ్రామాధికారము గలిగి, గొప్ప కుటుంబముతో పుత్ర పౌత్రులతో ధనధాన్య సంపదలతో పలుకుబడి గలిగి, బ్రాహ్మణకుటుంబ సమీపములో విద్యా బలముతో సుఖింతురు.

అశుభుడై యుండిన వంశమునకపకీర్తి తెచ్చి ధన వ్యయము చేయు పుత్రుల పుట్టించును. దేవబ్రాహ్మణ ద్వేషులై, గ్రామములో హీనులై, అన్న వస్త్రములకు లోకువగా, నిస్సంతతితో మాతృ పితృ గురు దేవబ్రా హ్మణ వృద్ధ సాధు సజ్జన దూషణల తినుచు నశింతురు.

చతుర్థమున శుక్రుడున్న స్థలము పంచకోణములతో ముందు స్త్రీల పేరుతో నుండును. దాని కాగ్నేయమున సమీపములో పశువులకు మేత వేయుట, పశువుల దొడ్డి, స్త్రీలు పిల్లలు మలమూత్రవిసర్జనము చేయు స్థలము, వం టకు పనికివచ్చు కట్టెలు కంపలు వేయు స్థలము, పశువుల కట్టివేయుట ఆ స్థలములోగాని ఆగ్నేయమునగాని ఇట్టివి వుండును. - శుక్రుడు ఆ జాతకునకు శుభుడై యుండిన ఆ స్థలము విలాసమందిరముగా తయారగును. వాహన ములతో, నవ యౌవన రూపలావణ్య యువతులతో, అష్టయిశ్వర్యములతో సుఖించును. స్త్రీలతో, పశు సంప దతో, సంగీత సాహిత్యములతో శోభాయమానముగా ప్రకాశించును - అశుభుడైనచో స్త్రీలతో పరాభవము, వ్యభిచారముతో ధన వ్యయము, అపకీర్తి పాలు, స్త్రీ

దుఃఖము, పశు నష్టము. ఆగ్నేయమున నీచస్థానమేర్పడి దానితో చింత స్త్రీలులేక పురుషదుఃఖము, స్త్రీల కలహములు, గ్రామములో అపకీర్తులు సంభవించును.

చతుర్థమున శనివున్న స్థలము చూచిన స్థలము ధనురాకారమై నల్లటి మట్టిదో విధవలహక్కుగా, మలమూత్ర విసర్జనచేయు స్థలముగా, బలిపెట్టెడి చోటుగా, కసువు దిబ్బలు యెముకలు కలదిగా, స్థలమునకు పశ్చిమమున పెద్దమ్మ సంబంధమైనవి బలిపెట్టెడి చోటుగా, భార్యలేని వానిదిగా, వంశము పాడయినదిగా, ఊరు విడచిపోయిన వారిదిగా, జాతరసమయములందు దున్నపోతును ముందు చూపునదిగా, మొదటిబోనమిచ్చు గృహముగా, కుంభ కూటికి మొదట గింజలుపెట్టు యిల్లుగా, పెద్దమ్మనుచేయు స్థలముగా, ఎదురుగా పెద్దమ్మనునిలుపు స్థలముగా, నిరంతరము విధవలుండు స్థలముగా, రోగగ్రస్తులు స్త్రీలుండు స్థలముగా నుండును. - శని శుభుడైయుండిన సర్వసౌఖ్యముల చేకూర్చును. దుర్వ్యసన దుర్వ్యాపార దురభ్యాసములవల్ల గాని, విధవల ఆస్త్రీలవల్ల గాని, అత్త అవ్వ తాత మామ అనువారి ఆస్త్రీలవల్లగాని, జూదమువల్లగాని దొంగవ్యాపారమువల్ల గాని, దోపిడీలవల్లగాని, దొంగలవల్లగాని, వడ్డీవ్యాపారమువల్ల గాని, బ్రాంది సారాయి వ్యాపారములవల్లగాని ఇట్టి నీచధనముతో ధనికుడై సర్వసౌఖ్యముల పొందును. పాపిష్టమైన ఇట్టివాటివల్లనే నశించును. నిలువనీడ వుండదు.

ప్ర:— బలిపెట్టెడి చోట్లు ఎట్లుండునందురు.

ఉ:— పెద్దమ్మను నిలువు చోటు, చేయు చోటు, రథము చేయు చోటు, కుంభ కూడు వండుచోటు, దున్నపోతుల పరికి త్రోయుచోటు, దున్నపోతును ముందుచూపు గృహము,

మొదట బోనమిచ్చు యిల్లు, నద్దికట్టించు యిల్లు, సొమ్ము లిచ్చు గృహము, దస్తగిరిసామి అరుగు, పెద్దమ్మ దేవాలయము, చౌడమ్మ గుడి, జ్యోతి ఆర్పు స్థలము, కాళీ ఆలయము ఇవి వామాచారము నడచుస్థలములు, బలిపెట్టెడు చోట్లు, వీటికెదురుగనున్న గృహములు నశింపగును. - పూర్వము ఎక్కువగా వామాచారుల బలమున్న దినములలో ఇవి గ్రామ మధ్యలో పెట్టి ఊళ్లనే నశింపుచేసిరి. జంతు బలుల అభివృద్ధిచేసిరి మారికాస్ఫోటకాది వుపద్రవముల తెచ్చి పెట్టిరి రాక్షసత్వము క్రూరముగా పెరిగి అభివృద్ధుల నన్నిటిని నశింపుచేసిరి. దీనివల్ల ప్రజలు అభివృద్ధి చెందనేరరు. ఉండిన - గ్రామమునకు వెలుపల వుండవలయునుగాని గ్రామమునకు మధ్యలోవుండరాదు. శాస్త్ర విరుద్ధము. గ్రామచ్ఛిద్రము.

చతుర్థమున రాహుగ్రహమున్న స్థలము సూర్పాకారముగానుండును. (చాట) సవ్యముగ తూర్పుపడమర లేక నైరుతి నుండి ఈశాన్యమున కుండును. చెదులుపట్టు స్థలముగానుండును స్థలమునకు నైరుతిమూల సర్పములకు నెలవుగా నుండును చోరులు కన్నము వేయుటకు వసతి గలిగివుండును - నైరుతిలో గృహముండిన నశింపై నందు వేర్పడును. ఇదివరకు నాశనమైన స్థలముగానుండును. శని శుక్ర బుధ గృహములైనచో చక్కగానుండును (అనగా శనిపాలిత లగ్నములకు) ఉన్న యింటి గ్రహ కారకత్వములతో సుఖశాంతులతో జీవింపచేయును. అశుభుడైనయెడల సర్పభయము, చోరభయము, భాగస్థులతో పోరు, గృహ కల్లోలము, గృహస్త్రీ చోరులగుట, నీచులచే పరాభవము, అపసవ్యముగా నడచు మానవులు జన్మించుట, క్రిమి కీట కాది బాధ గలిగి త్వరలో గృహము నశింపగును.

చతుర్థమున కేతువున్న స్థలము ధ్వజాకారముగా

నుండును. (జండా) తూర్పుపడమర సవ్యముగా నుండక నైరుతినుంచి ఈశాన్యమునకు స్థలముండును. పూర్వము మహమ్మదీయులు సన్యాసులు పకీరులున్నదిగా నుండును. జండా అరుగు పీర్లచావిడిగా, జండా చెట్టు నీడపారునదిగా, పూర్వము గోరీలు మసీదు వుండినదిగా, రెండు భాగములు గలదిగా, భాగస్తులతో కలహములు గలదిగా నుండును. - అశుభుడై యుంచిన స్మశానముగా, సర్ప క్రిమి కీటకాది బాధలుగలదిగా, అచలసిద్ధాంతులతో వక్రగతి మతముతో సన్యాసుల ఆశ్రమముగా, విధవా విధురుల దుఃఖము గలదిగా మార్చును. అశాంతులతో అవివేకులతో గృహము క్షీణింపచేయును. శుభుడైయుండిన శుభప్రదముగానుండును

శ్రీ= పలాన దిశన చీలుట, ఊదుట, పడుట, నగ్గుట గలదని చెప్పుచున్నారే, అదెట్లు చెప్పనగును.

గు= వత్సా, నవగ్రహములకు దిశలు చెప్పితినిగదా. యే గ్రహము చతుర్థమును పాపియై చూచునో ఆ దిశన నీవ డిగినవన్నీ వుండును. ఉదాహరణ - సూర్యుడు పాపియై చతుర్థమును చూచిన గృహము తూర్పు భాగమున చీలును. శుభుడై చూచిన ఆ గృహము చీలక శోభాయమానమై వెలుగొందుచు ఇట్లే అన్ని దిక్కులను గమనింపుము. ప్రతి గ్రహము పాపియైచూచిన ఆ దిశ అపాయకరముగా నుండును.

శ్రీ= నీ గృహము యిన్ని భాగలున్నదన్నారే, ఎట్లు.

గు= చతుర్థము గృహముగదా. ఆ చతుర్థమును యెన్ని గ్రహములు చూచునో, ఎన్నిగ్రహములుండునో అన్ని భాగలు గలదిగా నుండును. - కుజుడుండిన అన్న తమ్ములు, శని వుండిన విధవలు, చంద్రుడుంచిన పిల్లల తల్లి - మైనర్లు, రవి వుండిన పినతండ్రి- పెదతండ్రి, బుధుడుండిన మాతుల

న్యాయము గలవారు, శుక్రుడుండిన స్త్రీలు, గురుడుం
డిన తాత గాని పెదతండ్రి పినతండ్రి పిల్లలుగాని వుం
దురు. - పంచగ్రహకూటమి షట్గ్రహకూటమి గలిగి
అది చతుర్థముగా నున్నప్పుడు యిట్టి భాగములుండును.
ఎన్నిగ్రహములు చూచిన అన్ని భాగములుండును.

శ్రీ= గృహమునకు ఇరువాగుల గలుగు గృహముల శుభాశుభ
త్వముల తెలుపుచున్నారే, అదెట్లు.

గు= తృతీయ పంచమములలో శుభగ్రహములున్నయెడల తన
గృహమునకు యిరువాగుల శుభస్కారముగా గృహము
లుండును. - పాపగ్రహములున్న ఏ గ్రహములుండునో
ఆ గ్రహ కారకత్వములతో నాశనముచేయును. ఉదా॥
శుక్రుడున్న స్త్రీల ఆధిపత్యముక్రింద విలాస వినోదము
లతో, త్రాగుడు వ్యభిచారములతో పశువులాదిగా గల
శుక్ర కారకత్వములతో నాశనముచేయును.

శ్రీ= నీ గృహమునకెదురుగా ఇట్లున్నదన్నారే, ఎట్లు చెప్పితిరి.

గు= వత్సా, చతుర్థమునకు సప్తమమున యే గ్రహముండునో
ఆ విధముగా యెదురిల్లు వుండును లగ్నదశమమునగాని,
లగ్నసప్తమమునగాని శుభులుండిన ఎదురిల్లు కలకలలాడు
చుండును. - పాపగ్రహమున్న యెదురిల్లు పాడగును.
యేవిధమగు గ్రహముండునో ఆ గ్రహ కారకత్వములతో
నశింపగును. యే శుభగ్రహముండునో ఆ శుభగ్రహ
కారకత్వములతో పెంపొందింపచేయును.

శ్రీ= ఒక్కొక్క దిశన ఆటంకములు ఆక్షేపణలు యిచ్చుచుం
డునే, దేనివల్లనందురు.

గు= చతుర్థమును పాపిష్టులై యే దిశాధిపతి చూచునో ఆ దిశన
ఆటంకములు ఆక్షేపణలు యిచ్చును. ఊడి, చీలి, బగ్గి
వుండును. స్థలము చాలకుండును. ఆ దిశవారు అసూయ

కరులై ఆక్షేపణచేయుదురు

శ్రీ= ప్రభుత్వముతో ఆక్షేపణ గలుగుట, అగ్నితో భీతి గలుగుట, నష్టముగుట గలుగుచుండునే యే గ్రహామువల్ల నందురు.

గు= వత్సా, ప్రభుత్వకారక గ్రహము సూర్యుడు వీరు పాప గ్రహమై చతుర్థమును చూచిన ఆ గృహామునకు ప్రభుత్వముతో ఆక్షేపణ గలుగును. జుల్మానాలు వేయుట, పడగొట్టుట, కఠిన శాసనములు విధించుట తప్పక జరుగును. లేదా తూర్పుదిశనగలవారితో కలహములు, ఆక్షేపణలు గలిగించును. కడకు నాశనమొనర్చును. అగ్నితో నష్టపెట్టును. - శుక్రుడున్నను అగ్నిభయముండును.

శ్రీ= స్వామి, గృహముకట్టుటకు గ్రహములతో పనియా, లేక మాసములు తిథి వార నక్షత్రములతో పనియా, వాస్తు పురుషునితో పనియా, ఏది ముఖ్యమో తెలుపుడు.

గు= వత్సా! సంవత్సరములు, అయనములు, ఋతువులు, మాసములు, పక్షములు, తిథులు, వారములు, నక్షత్రములు, యోగములు, కరణములలో ప్రాణవాయువులేదు. గ్రహములందే ప్రాణమున్నది యజమాని జాతకరీత్యా గాని, ప్రశ్న లగ్నాత్ ద్వారాగాని, చతుర్థమునకు గురు పాలితునకు గురువు, శనిపాలితునకు శని వచ్చినప్పుడు గృహముల కట్టుటకు ఉపక్రమింపచేయును. చతుర్థమున బలముగా గ్రహమున్నయెడల కట్టించును. పాత గృహముల మరమ్మతుచేయించును. బావులు, వనములు, భూమి సాగుచేయుట, పశువుల వృద్ధిచేయుట మొదలగు స్థిరాస్తుల వృద్ధిచేయు తలంపు గలిగించును. దీనికితోడు నవమ స్థానమున శుభగ్రహమున్నవారు కార్యక్రమముల చేయుదురు. ధనము నిల్వలేనివారు కట్టుకొనలేరు. నిల్వ ధన

మున్నవారు కట్టుకొందురు ఈ మాసము శ్రేష్ఠమనుట, ఆ మాసము శ్రేష్ఠమనుట, జాడ తెలియక ప్రక్కజాడన పోవుచేనని తలంచుము. గ్రహబలమువల్లనే ప్రపంచమున పంచభూతములు పిపీలికాది మానవపర్యంతము (స్థావర జంగమములు) నడచుచున్నవని తెలుసుకొనలేక వ్రాసిన గ్రంథములు

శ్రీ= గ్రహబలము లేనిది, గృహము కట్టలేడందుర.

గు= అవును. గ్రహములు శుభులై చతుర్థదశమముల నున్న వారికి గృహ సౌకర్యముండును. లేనివారికి గృహములు చతుర్థమున గల వస్తుసముదయము, బంధువులాటిగా గలుగు అంగబలము దొరుకదు. కట్టలేరు.

శ్రీ= చతుర్థ శుద్ధిలేనివారికున్న వే, దానినేమందురు.

గు= మీన, కటక, కన్య, వృశ్చిక, మకర రాసులవారికి చతుర్థ శుద్ధిలేదు. పాపగ్రహముల గృహములు ఈ లగ్నములకు దశమము శుభస్థితి చెందివుండును మిగులు లగ్నముల వారికి చతుర్థ శుద్ధిగలదు. ఆ గ్రహములు ఎచ్చోటనైన శుభస్థితిలోనున్నయెడల గృహములుండునేగాని స్థిరముగా నిలువవు. వసతిగానుండవు మూలల ముక్కుల ఇరుకు సందులలో గల్పించి కట్టపెట్టును.

శ్రీ= చతుర్థమును ఏ గ్రహము చూడకనే గృహములుగలనే దానినేమందురు.

గు= చతుర్థాధిపతిని గాని, గురువును గాని లగ్న పంచమ నవ మాధిపతులు చూచిన గృహముండునుగాని వసతిగృహ ముగా నుండదు. తగినచోటు వుండదు. దీనిని జాగ్రతగా పరికించవలయును.

శ్రీ= విశాలమైనస్థలము విశాలమై సర్వ వసతులతో సర్వ వస్తు సముదయముతో కూడిన గృహములు కలవారిన్నారే,

వారిని చతుర్థశుద్ధిగలవారందుర.

గు= అవును. చతుర్థమున గాని, దశమమున గాని బలముగా లగ్న పంచమ భాగ్యాధిపతులున్నవారికే ఒకటి మొదలు కొని 10, 20, 30 గృహములు గలుగును. వసతి గృహములుగా నుండును. - గ్రహబలమనగా లగ్న చతుర్థము గృహస్థానమెట్లో చతుర్థలగ్నమును పండ్రెండు భాగలు చేయగా, ఒకటి రెండు మూడు భాగలకు లోపలనే గ్రహముండిన గృహములు, భూములు, బంధుమిత్రులు, గృహోపకరణములు, వాహనములు వస్త్రభూషణాలంకారములు, సౌఖ్యము శాంతి మొదలగునవి విరివిగానుండును. నాలుగు భాగ దాటి వుండిన తగ్గుచు వచ్చును. ద్వాదశ భాగలో గ్రహముంటే ప్రయోజనములేదని గ్రహించు. శనిపాలిత లగ్నములకు ద్వాదశభాగ శుక్రునిదిగాన శనిపాలిత లగ్నములకు బలముండును. వీరికి లగ్నసంధిలేదు.

శ్రీ= ద్వారమునకు (తలవాకిలికి) యే యే వస్తువులు ఎదురుండ కూడదందురు.

గు= వత్సా, లగ్నసప్తమమున దశమమున ఏ గ్రహముండునో ఆ గ్రహకారకత్వములు ఎదుట నిలుచును. సూర్యుడుండిన ధర్మ చావిడి, సత్రము, ఎదురింటి దీపము, యెదురింటి పొయ్యి వెలుగుసుగు, గుండము, లైటు స్తంభము గాన వచ్చును - శుభుడైన సుఖమే గలిగించును. పాపిదైన పాడొనర్చును.

చంద్రుడుండిన తూములు, జలజారి గుంతలు, బావులు, మిద్దెపై తూములు, యెదురుగా పోవు త్రోవ, పైకప్పులేని మొండి గోడలు, మాయముంతలు బూడ్చు స్థలము, వర్షమునీరు నిల్చు తగ్గు, గొడ్రాలి ఇల్లు, మహాడి నిలుచును. శుభుడైన మేలు, అశుభుడైన కీడు చేయును.

కుజుడుండిన - మోటు, చెట్టు, రోలు, గాడిగూడు, కిటికీ, వాకిలి మోటు, స్తంభము, ప్రాకారము మోటు, నిలువురాయి, నిట్రాయి, గానుగరోలు, రచ్చటరుగు వీటిలో యేదోవకటి వాకిలికెదురుగా నిలుచును కుజుడు శుభుడైన యజమానికి సుఖమేగలిగించును. పాపియైన ఎదురింటివారితో కలహములు గలిగించును. ఎదురిల్లును నశింపుచేయును. యజమాని సంసారము చిక్కులపాలు చేయును.

బుధుడుండిన వ్యాపారస్తుల, వైద్యుల, వ్యావహారికుల మంత్ర తంత్ర యంత్రముల వేసి జీవించువారిని, మాతులన్యాయము గలవారిని, దాస్యముచేసి జీవించువారిని, స్త్రీలకు పురుషులకు సంధిచేసి లాభముగడించువారిని మలమూత్రవిసర్జన స్థలముగా, వామాచారబలిపెట్టు స్థానముగా, పాడువడినగృహముగ నుండును. శుభుడైన సుఖముగా నడుపును. పాపియైన యజమాని సంసార స్త్రీలను రోగగ్రస్తులచేయును. దయ్యములు భూతములు పట్టెనని, గానవచ్చెనని భయపెట్టి ధనము దుర్వ్యయము చేయించును. భూతచికిత్సలకులతో నశింపుచేయును.

గురుడుండిన దేవాలయము అడ్డగోడ, బ్రాహ్మణ గృహము, దేవతా వృక్షములు (రావి, వేప, మారేడు, మోదుగ, తులసి), అశ్వర్థనారాయణ కట్ట, ధర్మసత్రము, భజనమందిరము ఇట్టివి తలవాకిలికెదురుగా నిలుచును - శుభుడైన ధనధాన్య సంపదలతో, గ్రామాధికారముతో, యశోన్నతితో యజమాని గృహము పావనముచేయును. యెదురిల్లు సర్వ సంపదలతో తులతూగును. పాపియైన యజమాని సంసారము చిన్నాభిన్నము చేయును. కడకు వంశ నాశనము, కళత్ర ధ్వంసము చేయును. యెదురిల్లు పాడుచేయును.

శుక్రుడుండిన స్త్రీల ఆధిపత్యముగల గృహము, పశువుల యిల్లు, పశువుల తోలుట కట్టివేయుట, వంటకు పనికివచ్చు కట్టెలు కంపలు పెట్టుట, వ్యభిచార గృహము, వంటచేయు చోటు, స్త్రీలు మలమూత్రవిసర్జనము చేయు మరుగుదొడ్డి, త్రాగుబోతులు జూదరులు వ్యభిచారులు సంగీత సాహిత్యములపై ప్రీతిగలవారుందురు శుభుడైన యజమాని సంసారము ఎదురిల్లు కలకలలాడును. పాపియైనచో యజమాని సంసారమును, యెదురిల్లును ధ్వంసము చేయును. అపనిందలపాలు చేయును. స్త్రీల దుఃఖజీవుల చేయును.

శని వుండిన విధవా విధుర గృహములు, మలమూత్రవిసర్జన స్థానము, బలిపెట్టెడి స్థలములు, గ్రామ దేవతాలయములు, ఈశ్వరాలయము, మాంస విక్రయ శాలలు, విధవా ఆధిపత్యముగల గృహములు, వ్యభిచార విధవలు, పాయఖానాదొడ్లు, దిబ్బలు, ఉచ్చలమడుగులు గలిగివుండును. కాటికెదురుగా దింపుడు కల్లము గలిగి వుండును. - శుభుడైనచో యజమాని సంసారము యెదురిల్లు శుభస్కరముగా నుండును పాపియైనచో రెండు గృహములలో అశుభములచేకూర్చి, దుర్గుణములలవరచి శూన్యముచేయును.

రాహు వుండిన శిథిలమైనది, విధవలది, చాలిచాలనిది, రెండుభాగలు గలిగినది, వక్రగతిగా నుండునది, చెదులు పట్టునది, భూతసంచలనము గలిగినదిగానుండును. ఒకప్రక్క తగ్గుగా వాకిటిముందు గలదిగా నుండును. - శుభుడైన రాహువైనచో శుభముగానే వుండును. అశుభుడైనచో సర్పదర్శనము చోరభయము శత్రుపీడ గలిగించును. కాలీ యిల్లుగా చేయును. లేదా కడగొట్టును. లేదా దుఃఖజీవుల పెట్టును.

కేతుగ్రహముండెనేని జండా అరుగు, పీర్ల చావిడి, వక్రగతి గలది, రెండుభాగలు గలది, మహమ్మదీయులు నివాసము చేసినది, సన్యాసులు ఫకీరులు కొంత కాలము వుండినది, దుఃఖజీవులు నివాసముచేసినది, తత్వబోధకులు వుండినది, దాడిపెంచి గడ్డలుమాసి తలమాసి వళ్లుమాసినవారు నివసించునది యెదుట నిలచును. శుభుడైన యజమాని సంసారము యెదురిల్లు శుభస్కరముగా నుంచును. - పాపియైన నీచులతో, మహమ్మదీయులతో నశింపుచేయును.

శ్రీ= స్వామి, మోట్లు తిరిగెడి యిండ్లు శుభమేనందురా? లేక అశుభమందురా.

గు= మోట్లు నాలుగు. - ఆగ్నేయం, నైరుతి, వాయువ్యం, ఈశాన్యము. ఈ నాలుగు మోట్లు గలవిగా నుండును. మోటు అనగా తూర్పుపడమర త్రోవ, ఉత్తరదక్షణము త్రోవ కలియుచోట నుండు గృహములు. ఇక్కడ నాలుగిండ్లకు మోట్లు వచ్చును త్రోవ పక్క విడువు స్థలము విడువక పోయిన నాలుగిండ్లు నశింపగును. అగ్నిమూల మోటుతిరిగిన స్త్రీలు దుఃఖజీవులగుదురు. వివాహములు అకాలముగా నడచును. వివాహము కాకపోయెనని దుఃఖంపచేయును కడకు గృహము స్త్రీల పాలగును పశువులతో నష్టపడుదురు. వ్యభిచార గృహమగును. అపనిందలు గలుగును. వివాహమై విడువబడిన వారుందురు. వయసులో భర్త గతించుటో రోగగ్రస్తుడగుటో తటస్థించి స్త్రీ దుఃఖ జీవితము నడిపించవలసివుండును. నిరంతరము గృహచ్ఛిద్రములు గలుగును. గ్రామస్తులకు లోకువనై పోవుదరు. అన్నవస్త్రములకు లోటు గలుగును. సంధి చేయుట, సంధి నడుపుట, ఇతరుల వ్యభిచరించుటకు స్థానమిచ్చుట ఇట్టి నీచములు ఇట్టి దుఃఖములతో వళించి ఇల్లు

స్త్రీల పాలగును.

నైరుతీ మూల మోటుతిరిగిన ఇంటిసొత్తును దొంగలించువారుగా నుండుట, వ్యభిచారములకు విలాసములకు వినోదములకు ధనము దుర్వ్యయము చేయువారుండుట, బిడ్డలులేనివారుండుట, పుట్టుట గిట్టుట కలిగి నిస్సంతతితో దుఃఖించువారుండుట, దొంగసొత్తుల కొనుట పట్టుబడుట, మంత్ర యంత్ర తంత్రముల వల్ల బ్రతుకువారిని మేపుట, గ్రామస్తులకు నీచులను భావము కలిగించుట, ఇట్టి నీచముల కలిగించి కడకు నాశనముచేయును.

వాయువ్య మూల మోటుతిరిగిన పిల్లలులేకుండుట గాని, విపరీతముగా కలిగిగాని, వారి విద్యకై వివాహములకొరకై చాలని ధనమై చింతించుట, విపరీతబుద్ధులు విపరీత నడవడిక విపరీత ఖర్చులు విపరీత విలాస వినోదములు కలిగి దినదిన క్రమేణ నశింపగును. దుఃఖ జీవులుందురు. పిల్లల జీవనోపాదులకు రొట్లు, దినకృత్యములకు రొట్లనను చింత. - అది పెద్ద యిల్లుగా గాని, యిరుకు యిల్లుగా గాని చేసి చింతింపచేయును గ్రామస్తులకు రొట్టూరమగు మనుష్యులుందురు. పిల్లలు అప్రయోజకులుగ తయారగుదురు. కడకు విక్రయమగుట నిశ్చయము.

ఈశాన్య మూల మోటుతిరుగు ఇల్లువల్ల గలుగు అశుభములు - పుత్రసంతతి నశించుట, ధన వ్యయము నీచజీవనము అధికారగౌరవములు లేకపోవుట, మోసము చేయువారు తోడగుట, అప్రయోజక సంతతి తోడగుట, దేవుడు దైవమను తలంపు లేకపోవుట, మైథున నిద్రాహారములే నిత్యజీవనముగా తయారగుట, పెద్దలచే దూషింపబడుట, దూరదృష్టి నశించుట, పుత్రసంతతివుండిన దుర్వ్యసనాలోలురగుట, కడకు గృహము తలలు మారుట, శిథిల గృహమై గృహచ్ఛిద్రములనేకము గలుగుట, వ్యభిచారు

లగుట ఇట్టి విపరీతములతో నశింపగుదురు. సౌఖ్యపడరు.

శ్రీ= వీధి కెదురు, దేవాలయమున కెదురు, శక్తి ఆలయమున కెదురు, బలిపెట్టెడు చోట్ల కెదురు, భజన మందిరముల కెదురు గల యిండ్లు శుభమా, అశుభమా స్వామి

గు= వత్సా, దేవునిచూపు ధ్వజస్తంభముపైన పడునట్లు ఇండ్లపైన వీధిపైన పోరాదని స్తంభముపైనే కనుదృష్టి పెట్టినను ఇండ్లు అడ్డమువచ్చిన నాశనమగుట తప్పదు. వీధి చక్కగా నుండవలయును. దేవాలయ ప్రహరి యెంతుండునో ఆ వెడల్పుతో గృహములు వృద్ధిచెందవు ఆ వెడల్పుతో వీధి ఆద్యంతము పోవలయును. అనీమకములు, అప్రయోజకములు, వ్యభిచారములు, త్రాగుడు, వావి వరుసలు లేని జీవులు, దైవభక్తి లేని గృహస్థులు, అన్యాయ ప్రవర్తకులు ఇట్టి చేష్టలుగలవారు దేవాలయము వీధిలో నుండిన తొందరగా పదభ్రష్టులగుదురు.

వీధికెదురుగల గృహము (వీధిచూలు) విపరీతమగు ఖర్చులతో, శత్రురోగ ఋణవిపత్తులతో, దున్నంతతితో, విపరీతమైన నడకలతో నశింతురు. లగ్నసప్తమ దశమముల చంద్రుడున్న వీధి కెదురు నీటి కెదురు బావి కెదురు నిల్చును.

శక్తి ఆలయమునకు, బలిపెట్టు స్థలమునకు, భజన మందిరములకు, యెదురిండ్లలో విధవలుండుటో, భార్యాభర్తలలో నొకరు రోగగ్రస్తులై సుఖములేక పోవుటో, రోగములచే దుఃఖజీవులగుటో తప్పదు. కడకు వంశము ధ్వంసము చేయును.

శ్రీ= ద్వారములు ఎత్తు, వెడల్పు యెంతుండవలయునందురు. ఇందులో శుభాశుభములున్నవా.

గు= నాయనా, గృహద్వారము (తలవాకిలి) పూర్వులు చిన్నదిగా పెట్టినారు. ఎందుకనగా గృహములో ప్రవేశించు

నపుడు తలవంచియే రావలయునను భావము వారిలో గలదు. సరాసరిగా రాకూడదను. తలంపు - యెందరో తల తగిలి బాధపడవలసివచ్చును గాన అయిదునుంచి ఆరు ఆరున్నరవరకు యెత్తు, మూడునుండి మూడున్నరవరకు వెడలువు వుండవచ్చును. విపరీతము అనకుండా మూలల కొలత సక్రమముగా చూచుకొని, ద్వారము ముందుకు వెనుకకు వరగకుండ నియమించుకొనవలయును - ద్వారములు యెదురుగా మూడు వుండరాదని వక మతము. అయిదు వుండరాకని ఏడు వుండరాదని మరొక మతము. ఇట్లు చెప్పువారు అనేకులున్నారు సంసారికి సరి మంచిది. ప్రతివస్తువు సరిగా నుండుట క్షేమము. యజమాని జాతకానుగుణ్యముగా జేసి వుండవలసినప్పుడు ఎట్లు త్రిప్పినా జేసినే నిలువును. అప్పుడు దానిని మార్చ నలవిగాదు. వసతి ననుసరించి పెట్టుకొనవచ్చును. - తలవాకిలి ఎత్తు, వెడల్పు ననుసరించి యెదురుగా నున్నవి అంతే వుండుట శ్రేయము. చిన్నవి వుండరాదు. ప్రక్క గదులకు తల తగలనట్లు యేవిధముగానైన పెట్టుకొనవచ్చును.

ఖగోళమున కుజమండలము త్రికోణముతో నున్నది. కుజుడు చతుర్థమందున్న ఆ స్థలము త్రికోణాకృతిగా ప్రత్యక్షముగా అగుపడుచున్నది. సమ చతుష్కోణముగా నున్న చంద్రమండలము సూర్యుని వెలుతురుతో గుండ్రముగా గానవచ్చినట్లు, భూమండలము సూర్యునివల్లనే గుండ్రముగా గానబడుచున్నదనవలయును. చతుర్థమున చంద్రుడున్న ఆ స్థలము చతుష్కోణముగా, నీరు పారునదిగా నున్నది. ముమ్మొనలు కుజమండలముగానున్నది. త్రిదేవులు, త్రిమూర్తులు మూడు మూడుగానున్నారు. భూకారకుడు మూడు మూలలతోనున్నాడు ఇంటికి మూడు వాకిండ్లు వుండకూడదు. - చతుర్థమున మూడు గ్రహము

లున్న మూడు ఇండ్లు మూడు భాగలు, మూడు అరలు. ఇల్లే అన్ని మూడుగా నుండును. మూడు వాకిండ్లతో శుభాశుభము లేవీ జరుగవు. వుండవచ్చును. వాని జాతకానుగుణ్యముగా గృహము కుదురును. – గృహము వాకిండ్లు మానవునికి శుభాశుభముల గల్పించలేవు. గృహము సవ్యముగానుండుట క్షేమమని శాస్త్రము చెప్పును గాని జాతకానుగుణ్యముగా గృహము కుదురును. – దీనిని మార్చుటకు బ్రహ్మతోగాదు.

శ్రీ= తలవాకిలికి యింటిలో యే యే వస్తువులు యెదురుండ కూడదందురు.

గు= గూళ్లు, తోట్లు, రోళ్లు, ఎదురురాళ్లు, నీళ్లకుండలు, మంచములు, తూములు ఎదురుగా వుండరాదు. ఇంటి చూలు, బైట చూలు అను రెంటిటిలో ఇంటి చూలు సంభవించిన గృహచ్ఛిద్రముల గల్పించును.

శ్రీ= స్థలము పావనమైనదనుటకు జాతకము యెట్లుండవలయునందురు.

గు= జాతకరీత్యాగాని, ప్రశ్నలగ్నాత్ గాని భాగ్యస్థానాధిపతి చతుర్థమున చతుర్థభావమునకు లోబలవుండిన వంశపరంపరగా భాగ్యవంతులై సర్వసౌఖ్యము లనుభవింతురు. – పంచమాధిపతివుండిన విద్యయు, కుజుడు శుభుడై వుండిన భూములు వనములు, లగ్నాధిపతివుండిన దేహారోగ్యము దేహసౌష్ఠవము దేహబలము వంశాంతము వరకు వుండి సుఖశాంతులతో జీవింతురు.

శ్రీ= గృహము పావనమగునని మత్స్య కూర్మ యంత్రములు వేయించుట, అష్టదిగ్బంధన చేయించుట, టెంకాయలు గుమ్మడికాయలు తలవాకిట కట్టుట శుభప్రదమే యందుర. తలవాకిటికి యంత్రము కొట్టుట గలదు. ఈ మాంత్రికులు

చేయునది సత్యమేనందురు.

౬== వత్సా, మంత్రము లేక యంత్రములేదు పూజ నైవేద్యము లేక యంత్రము లేదు యంత్రముల పూడ్చిపెట్టుట, వాకిండ్లకు కొట్టుట అన్యాయము. ఈ అన్యాయము గృహచ్ఛిద్రముల గల్పించి కడకు విపత్తుల పాల్ చేయును - నిత్య నైవేద్యము లేక ఏ యంత్రము పనిచేయదు. - ఇది కృత్రిమము. ఆ యంత్రములనే పూజామందిరము (దేవునిగూడు) లో నునిచి, నిత్యము వకవేళనైన దీపము ముట్టించి, బెల్లమో చక్కెరో కొంచము పెట్టి, మంత్రము లేకున్నను - స్వామీ నిన్ను నమ్ముకొన్నాము ఈ కుటుంబరక్షణ నీదే స్వామి అని చెప్పుకొని, ఆ ఆహారమును గృహములో అందరికి పంచిపెట్టి, తానూ యింత భుజించిన దైవభుక్త శేషము గృహస్థులందరు సేవించినవారగుదురు. గృహము గృహస్థులు పావనులగుదురు గాని, మూఢతనముగా చేసిన కీడు మూడుట నిజము. - తలవాకిట చావు, పురుడు, అంటు మొదలగు అస్పృశ్యతలు నడిచెడిచోటు అక్కడ యంత్రము వేసిన ఆ అధిష్ఠాన దేవత వుండునా, గూటిలో పెట్టి మ్రొక్కెడి దేవుడు యిల్లును కాపాడలేడా, లోకాలనే కాపాడు దేవుడు వాకిటవచ్చు క్రూరకర్మల కలరా స్ఫోటకాది ఉపద్రవములచూడలేడ, వాకిటిపై యంత్రము ఎందుకు వేయవలయును తెలియనివారిని మోసముచేయుటకే యని తెలుసుకొనుము. గుడిమ్మకాయలు, టెంకాయలు, నిమ్మకాయలు తలవాకిటకట్టుట మరింతకీడు. ఆ టెంకాయలో నీళ్లు మురిగి కుల్లిపోయిన ఇంటియజమానికి కీడు. గుమ్మడికాయ వరిటి వరిటి యెండగాలుట మరింత కీడు. అశుభ సూచకములేగాని శుభ సూచకములుగావు శాస్త్రజ్ఞులు కరువయినప్పుడు అశాస్త్రజ్ఞులు ప్రబలి యిట్టివి అనేకము గల్పించుచుందురు. గల్పించిరి. నిత్యము ఇలవేల్పునుగాని,

యిష్టదైవమునుగాని, దేవునిమూలపెట్టి దీపము వెలిగించి నైవేద్యము ఉన్న దేదో పెట్టి నమస్కరించి, దానిని గృహములోగల వారందరికి పెట్టి, తానింత సేవించుట శ్రేయోదాయకము. ఇట్లొనర్చిన గృహములన్నీ శుభమే కలిగించును. - మత్స్య కూర్మ యంత్రముల నట్టింట బూడ్చుట, అష్టదిగ్బంధనలు చేసి వాకిండ్లకు యంత్రములు గొట్టుట, గుమ్మడికాయలు కుంకాయలు వాకిటిలో కట్టుట గృహోరిష్టములని తెలుసుకొనుము.

కొందరు శీతలా మహాశీతల యంత్రముల వాకిటి పైన కొట్టుదురు ఇది మహా భయంకరము. ఈ దేవత వెంట్రుకలు విరియబోసుకొని, దిసిమొలతో ఒకచేత చాట మరొకచేత పొరకపట్టుకొని నిలుచుకొనివుండును. ఈ మంత్రముగాని యంత్రముగాని గృహస్థులు వాడరు. వాడిన స్త్రీలు రోగగ్రస్తులగుటో, శోకగ్రస్తులై నిత్య కలహములతో సౌఖ్యనాశనమగుటో, విధవత్వము సంభవించుటో తప్పదు. ఈ దేవత సన్యాసులు కొల్చునది. గాజులు గలగల వినినను, సురతసుఖము ననుభవించువారిని చూచినను ఓర్వదు. స్త్రీ దుఃఖమూ యింట చేకూర్చును. ఎక్కువగా ఈ యంత్రమునే వేయుచుందురు.

శ్రీ= స్వామి! బావి, మరుగుదొడ్డి, బచ్చలి (స్నానాలగది) గృహమునకు యే దిశలో వుంచిన క్షేమమందురు.

గు= వత్సా, నీవు చెప్పినవి మూడు నీచములేయగును. బావి దగ్గర నీళ్లుపోయుట, కాళ్లు మొగము కడుగుట, మూత్ర విసర్జన సమయానుకూలముగా చేయుట తటస్థించును గాన బావి మరుగుదొడ్డి స్నానాలగదులవంటివే. ఈ మూడు యింటికి వెనుక భాగములో వుండవలసినవేను. గృహచ్ఛిద్రము గలవారికే ముందుకువచ్చుట యింటికి వెనుక భాగములో వాకిలికి యెదురులేకుండ దొడ్డిపక్కనైన పెట్టుకొన

వచ్చును. – అది గృహస్థుని సౌకర్యమునుబట్టి కట్టుకొన వచ్చును. వాకిటికెదురైన చూలు గలుగును

కొందరు ఈశాన్యమూలనే బావి వుండవలయునను సిద్ధాంత మేర్పరచి, సౌకర్యముల నశింపుచేసినదే గాక, శాస్త్ర విరుద్ధముగా ప్రవర్తించినారు. ఈశాన్య మూల దేవమూలనియు, దేవమూల అధిపతి ధనకారకుడనియు చెప్పుచు, అక్కడనే కూపము (గోతి) త్రవ్వమనుట తెలిసి కాదని భావింపవలయును. నీటి కధిపతి చంద్రుడుగాని గురువు గాదు. జలరాసి కటకముగాని మీనము గాదు. మీనాకృతిగా ఆ రాశి వున్నదన్నారేగాని జలమున్నదని చెప్పలేదు. విన్నన్న చెప్పినది వేదమన్నట్లున్నది. ఈశాన్య మూలలో బావి అట్ల త్రవ్విన ధననాశనము, పుత్రహాని యగును గురుబలము నశింపగును బుద్ధిహీనులు గల్గుదురు.

శ్రీ= రెండిండ్లు కలసి గోడలో బావి త్రవ్వి అక్కడవారికి ఇక్కడ వీరికి వుండునట్లు చేసుకొందురే, శుభమేనందుర.

గు= ఒక వరలో రెండుకత్తులున్నట్లు ఆ యింటికి యీ యింటికి మనస్తాపముల గల్పించును. గృహచ్ఛిద్రముల గల్పించును. గోడలోగాక వెనుక భాగములో త్రవ్వుకొన్నచో ఎందరు భాగస్థులుండినా ఎందరెత్తుకపోయినా శుభస్కరముగానే వుండును.

శ్రీ= వంటగది యే దశన వుండవలయునందురు.

గు= వంటగది గృహములో అగ్నిమూలనుండుట మంచిది. – తూర్పు పరమట ఉత్తరం తలవాకిండ్లుగల యింటికి అగ్ని మూల వంటకు కుదురును దక్షిణము తలవాకిలిగల ఇంటికి అగ్నిమూల కుదురదు గాబట్టి, యే గదిలోనైన వాకిటి కెదురు లేకుండ పరమటికి ముఖముండునట్లు వంట పొవులు పెట్టుకొనవలయును. ఆ గదిలో అగ్నిమూలనే వుండవల

యును. కొందరు పూర్తి ఈశాన్యమూలనే పెట్టుకొందురు. అట్లు యింటికి ఈశాన్యమున వుండరాదు దేవతామందిరమే వుండవలయును. - ఆ గదికి ద్వారబంధముండవలయును. పౌవులు రెండుగాని, నాలుగు గాని వుంచుట మంచిది. వకటి, మూడు కీడు గల్పించును. పశ్చిమమునకు ముఖము తప్ప మరొక దిశకు పౌవుల ముఖముల నుంచరాదు. నాస్తికులు తెలియనివారు పెట్టుకొని కడకు చింతింతురు.

శ్రీ= ద్వారము మూలల కొలత హెచ్చుతగ్గులున్న అశుభమే నందుర.

గు= గృహములోగల వస్తువులు, గదులు సమానకొలత గలిగి, వాకిలిచొకట్టు వక్రించుట మేలగునని యెట్లు తలంతువు. - సమానకొలత చెడిన గృహములో ప్రతినోట వక్రగతిగా మాటలు వచ్చుచుండును. విపరీతముగా మాట్లాడుదురు గాన చక్కగానుండుట శ్రేయము.

శ్రీ= వాకిలి క్రింది బండ పై బండ కొన్ని యుండ్లకు చీలిపోవునే శుభమా, అశుభమా.

గు= సప్తమ దశమముల పాపగ్రహములుండిన తప్పక క్రింది బండ పై బండ చీలిపోవును. వాకిలిపైన ఊడును, చీలును.

శ్రీ= స్వామి, యే దిశకు యే గ్రహమో తెలుపుడు.

గు= వత్సా, నవగ్రహమండలములో గ్రహములను మార్చివేసినారు. వారి ప్రకారమైన దృక్కునకు రాదు. దృక్క పదభ్రష్టమగును తూర్పునకధిపతియగు సూర్యుని మధ్యకు చేర్చి, తూర్పునకు శుక్రుని నిలిపిరి యిది జోస్యమునకు విరుద్ధము. మధ్యలో త్రిమూర్తుల స్థానమేర్పడును గాని సూర్యుడుండడు తూర్పునకు సూర్యుడు - ఆగ్నేయము నకు శుకుడు - దక్షిణమునకు కుజుడు - నైరుతికి రాహువు

పశ్చిమమునకు శని - వాయువ్యమునకు చంద్రుడు - ఉత్తరమునకు బుధుడు - ఈశాన్యమునకు గురువు కేతువు స్థలమునకు అనగా భూమికి కుజుడు, ఆకాశమునకు చంద్రుడు అధిపతులు. ఈవిధముగా గ్రహమండలమున్నట్లు జోస్యము అనుభవము చెప్పుచున్నది - అష్టదిక్పతులలో తూర్పునకు ఇంద్రుడు, ఆగ్నేయమునకు అగ్ని, దక్షిణమునను యముడు, నైరుతికి నైరుతి, పశ్చిమమునకు వరుణుడు, వాయువ్యమునకు వాయువు, ఉత్తరమునకు కుబేరుడు, ఈశాన్యమునకు ఈశాన్యుడు అధిపతులు. - నవగ్రహములే అష్టదిక్పతులు. అష్టదిక్పతులే నవగ్రహములు. వేరుగాదు. - ఇంద్రుడే సూర్యుడు, అగ్నియే శుక్రుడు, యముడే కుజుడు, నైరుతియే రాహువు, వరుణుడే శని, వాయువే చంద్రుడు, కుబేరుడే బుధుడు, ఈశాన్యుడే గురువు - వారిఅంశ వీరు వీరిఅంశ వారుగా నున్నారు గ్రహరూపీ జనార్ధన - గ్రహరూపీ మహేశ్వర అన్న సూత్ర ప్రకారము మహేశ్వరాంశ కొందరు, జనార్దనాంశ కొందరుగా విభజింపబడి వున్నారు. - అష్టదిక్కులకు ఎనిమిది గ్రహములు పోగా కేతువు మిగిలి వున్నాడు. నైరుతికి ఈశాన్యము యెదురు గాబట్టి, రాహువుకు కేతువు ఎదురుగా నుండవలయునన్న ఈశాన్యముననే వుండవలయును. ఉ॥ గురు కేతువులు గలిగిన యోగమని, గురు రాహువులు గలిసిన గురు చండాలయోగమని అన్నారు. గురువునకు రాహువు శత్రువు, కేతువు మిత్రుడు. కేతువు మోక్షకారకుడు గాన కేతువుకు గురువు చోటొసంగినట్లు అనుభవములు దృక్కులు అనేకమున్నవి. అష్టదిక్కులకు నవగ్రహముల సరిచేసినారు. శాస్త్రమునకు సరిపోవుచున్నవి

తూర్పునకు శుక్రుని, ఆగ్నేయమునకు చంద్రుని, వాయువ్యమునకు కేతువును, ఉత్తరమునకు గురువును,

ఈశాన్యమునకు బుధుని మార్చి గ్రహమండల మేర్పరచినారు. ఇది దృశ్యకు రాదు. దేవాలయములందు యిదే రీతిగా నవగ్రహముల కూర్చుండబెట్టిరి. ఒక్కొక్క గ్రహమునకు ప్రదక్షిణ నమస్కారములు చేయుటకు, పూజించుటకు వీలుగాకుండ చేసిరి ఇదియుగాక - గ్రహరూపీ జనార్దన అన్న వాక్యము మరచి, అందున్న దైవమును మరచి, నవగ్రహములలో మున్ను తానుచేసిన పాపఫలమెవరియందున్నదో పుణ్యఫల మెవరియందున్నదో తెలియక, పూజించు టెవరిని దానమియ్యవలసిన దెవరికి అను విషయము నెరుగక, కలేసికొట్టా కావేటిరంగ అన్నట్లు అందరిని గొబ్బెమ్మలవలె కూర్చుండబెట్టిరి. పాపులకు దానమావశ్యకమని, పుణ్యులకు పూజ ముఖ్యమని తెలుపరైరి అందరికి ప్రదక్షిణ నమస్కారముల చేయమనిరి. అది దేవాలయము గాని నవగ్రహాలయము గాదు దైవారాధన, దైవసేవ చేయుచోటున నవగ్రహ ప్రదక్షిణ నమస్కారములెందుకు గ్రహరూపీ జనార్దన అన్నప్పుడు - ఆయన రూపమేగద వారు. వారినే గొలుచునప్పుడు, పూజించునప్పుడు వీరెక్కడివారు.

శాస్త్రవిరుద్ధమని కొందరికి తెలిసినా, పెద్దలు చేసిన దానిని తప్పులుపట్టరాదను భావముతో నోరు మెదల్ప లేక పోయిరి. ఇది జ్యోతిశ్శాస్త్రమునకు విరుద్ధము. తిరిగి పూజించెడి ప్రజలకు నిష్ఫలము. - ముందుచేసిన పాపపరిహారమునకు, ముందొనర్చిన పుణ్యాభివృద్ధికి మానవులకు మార్గదర్శకమిచ్చునట్లు లేవు వృథాశ్రమ అప్రయోజకము. ఇందులో మనము ముందుచేసిన పాపఫలము యవరెవరియందున్నది, వారెవరు. - మనము చేసిన పుణ్యఫలము యే మండలాధిపతులయందున్నది, వారెవరు అన్న విషయమే తెలియక నవగ్రహములకందరికి దానము, అందరికి

పూజా చేసిన ధాన్యముల తీసుకపోయిన యజమాన్ని, అప్పుడు పాపపుణ్యములేని నిర్జీవ ప్రతిమ ఆయెను పుణ్యము సర్వమునశించిన జీవి ఈలోకమున క్షణము నిలువదు గాన పాపఫలమున్న మండలాధిపతులకు దానము ఇచ్చుట క్షేమము. పుణ్యుల పూజించి తృప్తులచేయుట శ్రేయము

శ్రీ= ఏ విధముగానుండిన ప్రజలకు శ్రేయోదాయకమందురు.

గు= సూర్యుని మొదలుకొని నవగ్రహములు గదా. సూర్యుని గ్రహ సామ్రాట్ అనుచున్నాము. సూర్యునే ముందు చెప్పెదను. - సూర్యమండలము వలయాకారము (గుండ్రము) వలయాకారముగా మండలము కట్టి, (అరుగు) దానిపై దీర్ఘచతుష్కోణముగ గుడిని కట్టి, గుడిలో సూర్య విగ్రహము ప్రతిష్ఠచేసి, ఆ విగ్రహము ముందు సూర్య యంత్రము బండలో మొలిచిపెట్టి, గుడిపైన సూర్యమంత్రమును బండలో చెక్కినదానినునిచి, మండలమందే తెల్ల జిల్లేడు చెట్టును వేసి, సూర్య పతాకము గుడిపై నునిచిన సూర్యభగవానుడు పదిలముగా అందేవుండును. నిత్యము పూజ నైవేద్యము చేయుచుండినట్టి సూర్యునకు ప్రదక్షిణ నమస్కారములు చేసిన, గగన మండలమందున్న సూర్యునకు ప్రదక్షిణ నమస్కారములు చేసినట్లాయగును. అక్షి కుక్షి యందు గలుగు వ్యాధులేగాక సర్వవ్యాధుల నిర్మూలించును. తేజస్సు నిచ్చును. ఉద్యోగప్రాప్తి గలిగించును రాబోవు జన్మకు రాజ్యము లేలించును. - ఇట్లే అన్ని గ్రహములకు మండలములు, సమిధవృక్షములు, విగ్రహములు, యంత్రములు, మంత్రములు, పతాకములు తయారుచేసి పాపగ్రహములకు దానము - శుభగ్రహములకు పూజలు జాతకాను గుణ్యముగా గాని, ప్రశ్న లగ్నాత్ ద్వారా గాని చేయుచు వచ్చిన మానవులకు శ్రేయోదాయకము. నవగ్రహముల నొకచోట గోష్ఠ్యుల్లలబెట్టినట్లు పెట్టి ప్రద

క్షణ నమస్కారములు చేసిన, ఫలము శూన్యమని తెలుసు కొనుము.

శ్రీ= స్వామి! సమిధలన్నారే, యే గ్రహమునకు యే సమిధయో తెలుపుడు.

గు= సూర్యునకు జిల్లేడు, చంద్రునకు మోదుగ, కుజునకు సండ్ర, రాహువునకు గరిక, గురువునకు రావి, శనికి జమ్మి, బుధునకు అపామార్గము (ఉత్తరేణి), కేతువుకు దర్భ, శుక్రునకు మేడి - సమిధలు.

శ్రీ= రాహువునకు గరిక అన్నారే, వృక్షము యేదీ వేయకూడద. గరిక కొంతకాలముండదే, దానికేమందురు.

గు= వత్సా, రాహువు భూతగణములో చేరినవాడు గాబట్టి, భూతనివాస యోగ్యమైన వృక్షమొకదానిని నిర్మించవచ్చును. ముంబ్బుజువ్వి వేసి దానిక్రింద గరిక వేయువచ్చును. బుధునికి ఉత్తరేణి, మఱ్ఱి వేయువచ్చును. - వీరు భూత నాయకుడు, శాంబరీ విద్యాక్షుపీణుడు. బుధగ్రహము నీడ యెక్కడపడునో అక్కడ భూతములు నివసించుచుండును. - మఱ్ఱి భూతనివాసము. మఱ్ఱి వేయువచ్చును.

మఱ్ఱి, జువ్వి, ముంబ్బుజువ్వి, తాండ్ర, మేడి, చింత భూతనివాసములు. - వేప, రావి, మోదుగ, జిల్లేడు, మారేడు దేవతావృక్షములు ఇవి గృహముల ముందు గాని, గ్రామములో గాని వుండరానివి. వీటి నీడపారిన గృహములు సుఖశాంతులులేక నశించును.

శ్రీ= వేప మంచిదని యింటిముందు వేసుకొందురే, మంచిది గాదందురా - దేవతావృక్షము లెందుకుండకూడదు.

గు= వేపచెట్టుకు నారాయణి అను పేరు గలదు. (అశ్వర్థనారాయణ) దీనిలో లక్ష్మీనివాసము లక్ష్మీకరమైనదనియే మంత్రములకు, భూతబలికి, పెద్దమ్మ గుడికి శుంచితము చల్లను

దీని మండలనుపయోగించుకొనుచున్నారు. పార్వతికి ప్రీతి కరము పార్వతీనివాసము మేడి - మారేడు లక్ష్మీనివాసము - మోదుగ సరస్వతీబ్రహ్మ నివాసము (తెల్లమోదుగ శ్రేయోదాయకము). - రావి విష్ణు నివాసము. - జమ్మి రుద్ర నివాసము (భైరేవుడు). వీటిచెంత నీచముగా మలమూత్ర విసర్జనచేయుట, చేట పొరక ఆనించుట, పాదరక్షలు తగిలించుట, సంపర్క దోషము తగులుట, బహిష్టి అయినవారు తగులుట యిట్టి నీచములు చేసిన నాశనముచేయును గాన గృహాములచెంత వుండరాదు. దేవాలయములచెంత వుండ వచ్చును.

శ్రీ= మరి యే వృక్షములు గృహాంగణములో, గ్రామములో వుండవచ్చునందురు.

గు= వత్సా, ఫలవృక్షములగు మామిడి, వెలగ, నేరేడు, తియ్య నేరేడు, నిమ్మ, దూదినిమ్మ, నన్నినిమ్మ, సపోట, జామ, వారుజూపి, మునగ, కరివేప, పనస, బాదాము, ఉసిరిక, ద్రాక్ష, టెంకాయ మొదలగు ఫలవృక్షములు (సీతాఫలము, దాళిమ్మ) పొన్న, పారిజాతము మొదలగు పూలచెట్లు శ్రేయమొనగును. - భూతనివాసములు దైవ నివాసములగు వృక్షములు గృహామునకు హానికరము.

శ్రీ= వారుజూజి, కరివేపాకు ఫలవృక్షములు గావుకద. దీని నుండి ఓషధులు మంచివి తయారగును.

గు= వారుజూపి శుభఫలమొనగును. వివాహాములు గానివారు పూజించిన వివాహాములగును. దీని గాలి యెంతో ఆరోగ్యము. ఎట్టిఅవిశె మంచిది. శుభములకు నెలవని ఆయుర్వేదము చెప్పును. కరివేపాకు క్రిమిసంహారము చేయును. ప్రాణవాయువునకు అమృతప్రదమైనది. అందువల్లనే ఆకును తిరగబోతలో వేయుచున్నారు. పనపుకూడ క్రిమి

సంహారిగాబట్టి ప్రతిచోట వాడుచున్నారు. స్త్రీలకు చాలా ప్రీతికరము శుభకార్యములలో ప్రతిచోట వాడుచుందురు. గురువు యొక్క రంగు పీతము. ఈ రంగు వస్త్రములు, ఈ రంగు హిందూసంప్రదాయమునకు శ్రేయము. గురువు శుభుడని వారి రంగు శుభస్కరమని వారి భావము.

శ్రీ= నిమ్మ గృహమునందుండరాదందురే, తాము వుండవచ్చు ననుచున్నారే, యెందువల్ల.

గు= నన్ననిమ్మ పండ్లు దైవయోగ్యము, భూతయోగ్యము, మానవయోగ్యము ఈ చెట్టెందుకుండకూడదు. ముండ్లున్నవని వామాచారులు మంత్ర యంత్రములకు వాడుదురని, శక్తి దేవాలయములలో కత్తికి చెక్కుదురని, బలిస్థానములలో వాడుదురని కూడదన్నారు అన్ని స్థానములకు నిమ్మపండ్లు క్షేమకరమైనవి గాబట్టి వుండవచ్చును.

శ్రీ= గృహ ప్రాకారములో మునగ కూడదు. బ్రాహ్మణుల యింటిలో వుండనే కూడదు, వండకూడదు, తినకూడదదన్నారే, కారణం.

గు= మాంసాహారులు మాంసము తిని యెముకలు ప్రక్కనుంచుకొన్నట్లు, గింజల గుజ్జును తిని పిప్పిని విస్తరదగ్గర యెముకలవలె పెట్టవలసివచ్చునని, సర్వత్రా అతివర్జయేత్ అన్న ఆయుర్వేదశాస్త్ర ప్రకారము అతిగా వుష్ణముగలదనియు వదలిరేగాని, ఇందులో తప్పిసుమంతయు లేదు. పాపము లేదు. - పాపము రానిదేదైనను మానవ యోగ్యమేనని తలంచుము.

శ్రీ= మునగ చెట్టు క్రిందకిపోయిన తిరిగి ఉపనయనము చేయవలయునన్నారే నిజమా, ఆ చెట్టేమి చేసినది.

గు= అంతటి దెబ్బకొట్టినగాని మానవులు నిలువరని శాసించిరే గాని, అందులో తప్పేమియు లేదు. ఉల్లి, తెల్లుల్లి గడ్డలు.

అపరిమితమైన వేసి అని వదలిరి. - కొందరు బ్రాహ్మణులు నల్లవంకాయలు తినరు. మరికొందరు అతిచలువ గలవని బీరకాయలు, నేతిబీరకాయలు, కలింగరికాయలు తినరు ఈతకాయలు, తాటిలుంజలు తినరు. పుంటికూర అందు రని ఉడకబెట్టి కురుపులకు కట్టుదురని గోంగూర ముట్టరు. ఉల్లగడ్డలు, సబ్బుబియ్యము తినరు. గడ్డ పదార్థముతో చేయబడిన కృత్రిమ పదార్థమని విడిచిరి - ఉల్లగడ్డలకు మలము సత్తువగానుపయోగింతురని వారి తలంపువల్ల విడ చిరి. ఇట్టి ఆచార వ్యవహారముల చూచి మూఢనమ్మక మన్నారు. వీటివల్ల పాపము రాదు పుణ్యము లేదు.

శ్రీ= స్వామి, గృహము కట్టు పనివారు వాకిలి నిలబెట్టునప్పుడు, వాకిలి పైబండ ఎత్తునప్పుడు, మొత్తువేయునప్పుడు జంతు బలి చేయవలయునని బాధించి బలిపెట్టి రక్తము బండలకు పూయుదురే, మంచిదేనందుర.

గు= నత్సా, వామాచారము అనాదినుండి వున్నది వారు మితముగా దైవమునకేనను తలంపుతో చేయుచుండినారు. ప్రకృతకాలములో వీరి కడుపు నింపుకొనుటకు చేయుచు న్నారు. జీవహింసచేయుట భయంకర పాపము. ఈ ఇల్లు వంశాభివృద్ధియై పదికాలములుండవలయునను తలంపుతో కట్టు గృహమునకు ప్రప్రథమముననే జంతుబలి చేయుట నాశనమునకేనని తలంచుము. అహింసా సిద్ధాంతము టెంకాయ, వడపప్పు, పానకము, పూలు, పండ్లతో పూజించుట శ్రేయోదాయకము.

శ్రీ= క్రొత్త ఇంటిలో యజమాని గృహప్రవేశమగుటకు ముందు గాని, చేరిన రాత్రికి గాని ఆవుల తోలుదురు లేదా ఆనాడే గోవునుపూజించి దానాపెట్టుదురే, శుభమేనందుర.

గు= శనిపాలిత జాతకులకు శుభమే చేకూరును. గురుపాలిత

లకు కీడు చేయును. - గోవు మూగతరువుకు గురుడు, పాలిచ్చు ఆవుకు చంద్రుడు, ముసలి ఆవుకు శని కారకులు గాన గురుపాలితులు ఆవుల తోలరాదు కోడె గిత్తను త్రిప్పుట క్షేమము.

శ్రీ= తూర్పు - పడమర, ఉత్తర - దక్షణము క్రింది యిల్లు ఎంతో అంత మహాడీ వేయక వకమూల కొంచము వేయుదురే, మంచి దేనందుర.

గు= యే మూల మహాడీ వేయుదురో ఆ మూల గ్రహాధిపతి కారకత్వములచేత కీడు బొందుదురు. క్రింది భాగములో తూర్పు పడమరగాని, ఉత్తర దక్షణముగాని ఇల్లు ఎంతున్నదో అంత పొడవున మహాడీ వేయవలయునుగాని, వక మూల వేసి వకమూల విడువరాదు. - ముందు భాగము గాని, వెనుక భాగమునగాని వేయుట మంచిది. వక చెంపన వేయుట మధ్యమము. ఒకమూలన మాత్రము వేయుట అధమము. కాదని వేసిన గృహాచ్ఛిద్రములు యేర్పడును.

శ్రీ= స్వామీ, సోపా వేయక ముందు భాగమున పెంకులతో గాని, బోదలో గాని క్రిందికి వంచి అనేక ప్రజలు వార పాకు వేయుదురే, మంచి దేనందుర.

గు= నాయనా, ముఖద్వారము గానరాకుండ వంగి యుండుట నోరును కట్టినట్లు ముఖమునకు కప్పినట్లగును. ఇంటి ఎదుట నిలచి చూచిన ముఖద్వారము చక్కగా గానరావలెను. వారపాకు వంచిన సమీపించి చూచినంతవరకు ద్వారము కనబడదు గాన పసారా వేసుకొనుటే క్షేమము. వెనుకైనను అంతే. ఇరువాగుల వేసినను అంతే. ఒక ప్రక్క వేసి, మరొక ప్రక్క వేయకుందురు. ఇది మరింత కీడు. భార్య రోగగ్రస్త యగును ఇరుప్రక్కల వేసిన క్షేమము. వెనుక ముందు ఒక ప్రక్క వేసుకొనవచ్చును. రెండు ప్రక్కల వేయుటకూడ మంచిదే ఇరు ప్రక్కలలో ఒక

ప్రక్క వేసి మరొకప్రక్క విడువరాదు. ఆ కృతి చెరచి నట్లగును. గాన దోషమాపాదించును.

శ్రీ= స్వామి, గృహప్రవేశమునాడు తలవాకిలి కడపపై పంచ పాత్రలో బియ్యముపోసి, కొబ్బరగిన్నె పెట్టి గృహిణితో ఆ పాత్ర లోపలపడునట్లు కాల తన్నించి గృహప్రవేశము చేయింతురే, మంచిదేనందుర.

గు= వత్సా, శిరిని కాలతన్నుకొని ఘిల్లాలు యింటిలో ప్రవేసించినట్లు భావించిరేగాని, తప్పును గ్రహించలేకపోయిరి. యింటిలో యే వస్తువునైన కానక కాలు తగిలిన, కాలు తగిలి పడిపోయిన కన్నులకద్దుకొని యెత్తిపెట్టు ఆచార మున్నది. బియ్యము కొబ్బర చంద్ర కారకత్వముగలవి చంద్రుడు సస్యాధిపతి సుఖమునకు కారకుడు. పాడికి పంటకు సకలసౌఖ్యములకు ముఖ్యుడు. స్త్రీలు పశువులు మాతృస్వరూపము దాల్చుటకు, పాడి గలుగుటకు, శిశువులభివృద్ధిచెందుటకు చంద్రుని అనుగ్రహము కావలయును. అట్టి చంద్రుని కాలదన్ని పుణ్యము నశింపుచేసుకొనుటయే నని తలంపరైరి. ఉ॥ చంద్రుడు పాపియైన పండిన పంటలో కాలు ఎక్కువగాపోవును. సన్నపిల్లలు నశించుట, అర్థ పాడి పంట గలుగుట, సుఖము లేకపోయెనని దుఃఖించుట, బుద్ధిబలములేని పిల్లలు గలుగుట యిట్టివి అనేకము గలుగును. చంద్రుడు శుభుడైన కావలసినంత సుఖముండును గాన కాల తన్నరాదు. అశుభసూచకము.

శ్రీ= స్వామి, కొన్నియిండ్లకు వసతిలేక బచ్చలి (స్నానాలగది) ముందు భాగమున పెట్టుకొందురు. - వెనుక భాగమున స్నానాల గదినుంచి యింటిలో పక్కప్రక్కన కాలువ తీసి, ముందుకు నీళ్లువచ్చి వీధి కాలువలో పడునట్లు చేసుకొందురే, శుభమేనందుర.

గు= గృహ యోగము చక్కగా లేనివారి కట్టి స్థలము లభించి శాస్త్రవిరుద్ధముగా మార్చును. అశుభముల చేకూర్చును. దొడ్డివాకిట విడచిన మలమూత్రములు, స్నానము చేసిన నీరు తలవాకిటివరకు వచ్చిన నీచముగాదా గృహములో ఈ నీచము వెళ్లిపోవుట గృహచ్ఛిద్రముల చెలరేపద. - యేనాటికైన తలలో జబ్బులు గలిగించి అలక్ష్మినివాసముగా మార్చకపోదు.

శ్రీ= స్వామి, కొన్ని ఇండ్లు పడిపోయి కొంతకాలమైన తరువరి మరొకరి స్వాధీనమై గృహమగుటకు కారణమేమందురు.

గు= వత్సా, ఖగోళమున నవగ్రహకేంద్రముల నీడ పరమాణువు మొదలుకొని అణువు వరకు, అణువు మొదలుకొని పకదేశము వరకు వాటి నీడ పడుచుండును ఆ నీడలో అయిదారు గ్రహముల నీడ వకచోటనే పడును. ఒకచోట వకగ్రహము నీడయే పడును. వాటిలో మిత్రరూపమై, శత్రురూపమై, మృత్యురూపమై నీడ పడును. ఆ స్థలమునకు అట్టి జాతకులే వత్తురు. స్థలాభోగము, నరాభోగం, శిలాభోగము అను వాక్యప్రకారం ఆ స్థలములో మానవులు గృహము కట్టినను గురు శనులు వచ్చుచు పోవుచుండుటలో దానికి స్థలభోగము చెడినప్పుడు గృహము శిథిలమగును. మళ్లీ భోగము వచ్చినపుడు గృహమగును. ఆ స్థలమునకు అట్టి జాతకులే వచ్చుచుందురు. నవగ్రహములలో గురువు పదిరెండు యేడులకు, శని ముప్పది యేడులకు కాలచక్రము వకసారి తిరుగుచుందురు. మిగులు గ్రహములకంత బలముండదు వీరిరువురే ముఖ్యగ్రహములగుటవల్ల, గురుబలము శనిబలము ఎట్లున్నదో చూడమనెదరు. పాపగ్రహము వచ్చినప్పుడు పాడుచేయును. శుభగ్రహము వచ్చినప్పుడు బాగుచేయును. జాతకానుగుణ్యముగా స్థలము గాని, గృహము గాని దొరుకును. చతుర్థి

క్కులగల యిండ్లు - స్థలములు, వస్తువులు, దిశలు (చెక్కు బంది) మారదు. యెక్కడపోయినను వుండును. మానవుడు పుట్టినప్పుడు యెట్టి స్థలమున వుండెనో అట్టి స్థలమే దొరుకుచుండును. దశానుకూలముగా గృహము భవనమైనను మొదటి చెక్కుబంది మారదు. ఇది జననకాల గ్రహబలమందురు. - జాతకుని చతుర్థమున నొకగ్రహము శుభగ్రహమైయుండిన ఆ గ్రహముయొక్క మండలమెట్టిదో అట్లనే స్థలముండును. అదేవిధముగా గృహము తయారగునని తలంచుము. - గ్రహసమ్మేళన గలిగిన ఆ స్థలము భాగములగును. ఎన్నిగ్రహములుండునో అన్ని భాగలుగా తయారగును. పాపగ్రహ శుభగ్రహ కలయిక అయినచో కొంత శుభస్వరముగా, కొంత అశుభస్వరముగా, రెండు విధములుగా, కొంత యెత్తు కొంత తగ్గుగా తయారగును. కట్టునపుడు అనేక చిక్కులు గలిగించును. అష్టమాధిపతి చతుర్థమందుండినవారు కట్టుటకన్నా కొనుటమేలు. కట్టిన అపాయము తప్పదు.

శ్రీ= ఇల్లు ఇన్ని భాగలుగా ఇన్ని గదులుగా ఉన్నదన్నారే, యెట్లు చెప్పితిరి.

గు= వత్సా, చతుర్థమును ఎన్నిగ్రహములు చూచునో అన్ని భాగలుగా, అందరు భాగస్తులుగా, అన్ని గదులుగా, అంతకు రెట్టింపుగా గదులు యేర్పడును. శుభగ్రహములైన గదులు పెద్దవిగా వసతిగానుండును. పాపగ్రహములైన చిన్నవిగా వసతి లేనివిగా, వెలుతురు గాలి లేనివిగా తయారగును.

శ్రీ= ఇంటిముందు స్థలము ఒకప్రక్క యెక్కువని, ఒకప్రక్క తక్కువని, వకప్రక్క తగ్గని, దారి వక్రముగా (త్రాసు) పోవునని, నీళ్ల తకరారని, చిన్న అరుగు పెద్ద అరుగని చెప్పుచున్నారే, యెట్లు.

గు= వత్సా, లగ్న ద్వితీయము వీధి ద్వితీయమున శుభగ్రహమున్న వీధి వెడల్పుగానుండును. యే ఆక్షేపణ గలుగదు. పాపగ్రహమున్న యడల మూలగా వీధి పోవును. యింటి ముందు ఒక్కప్రక్క యెక్కువ స్థలము, మరొక ప్రక్క తక్కువ స్థలము పెట్టును. ఒకప్రక్క యెత్తు వక ప్రక్క తగ్గు పెట్టి, వర్షపునీటితో స్థలము కోత గలిగించును. నీళ్లు పోయుటకు తూములు పెట్టుటకు ఆక్షేపణ గలిగించి, ఎదురింటివారితో మనస్తాపములు గలిగించును. ఆ ఉన్న గ్రహము శత్రుస్థానాధిపతియైన కలహములు, అష్టమాధిపతియై శుభగ్రహములు చూడకున్న కలహములో, చచ్చుటో, చంపి కారాగారమనుభవించుటో తప్పదు.- స్థలమునకై తగాదా పడుచుందురు. పాపగ్రహము దిట్టముగానుండిన వకప్రక్క అరుగుకు కావలసినంత స్థలముండును. మరొకప్రక్క స్థలము తక్కువగానుండుటచే చిన్న అరుగైన పెట్టుదురు. వదలిపెట్టనైన వదలిపెట్టుదురు.

శ్రీ= యిల్లు వకప్రక్క ఎత్తు, మరొకప్రక్క తగ్గు గలిగివున్నవే, దేనివల్ల.

గు= చతుర్థమున పాపగ్రహ శుభగ్రహ సమ్మేళన గలిగిన, ఒకప్రక్క యెత్తు వకప్రక్క తగ్గు వచ్చును. అలంకారము చెడును. యే దిశాధిపతి చతుర్థమున నుండునో ఆ దిశకు వంగి వుండుటగాని, దాని యెదురు దిశకు వంగి వుండుటగాని సంభవించును.

శ్రీ= యిల్లు కట్టు సమయములో యజమాని రోగబాధనొందుటో, దివంగతుడౌటయో, గృహము పెంత్తుబడక నిలచిపోవుటో జరుగుచున్నవే, కారణమేమందురు.

గు= వత్సా, చతుర్థమందు షట్స్థానాధిపతి వుండిన రోగపీడితుడై, శత్రు బాధ ఋణ బాధ గలిగి దుఃఖించును.-

అష్టమాధిపతి యెనిమిదవ భాగకు లోపలవుంశిన తప్పక చావు సిద్ధించును. దశమమున అష్టమాధిపతి వుండిన పై కప్పు వేయనియ్యాడు. విపత్తుల గల్పించి, అనుమానమున కాస్పదమిచ్చి నిలిపివేయును. దానికెవ్వరుగుకొన్నను అట్టి చిక్కులే తెచ్చిపెట్టును. - ధర్మసత్రములు కట్టించి, మర మ్మతులు చేయించి, కల్యాణమంటపములు కట్టించి, పాత దేవాలయముల బాగుపరచి, రచ్చటరుగులు కట్టించి, బీద లు తలదాచుకొనుటకు కొన్ని యిండ్లను కట్టించి యిచ్చి వారితో ప్రతిఫలము కోరని వారికి భవనములు, వసతి గృహములు, మేడలు యే ఆటంకములులేక కలుగును. ఉన్నవాటిని పడగొట్టి నేలమట్టముచేసినవానికి యిట్టి విప త్తులు మరుజన్మలో గలుగునని జోస్యము చెప్పుచున్నది. తప్పదు. చేసినది చేయించితీరునన్న వాక్యము రిత్తపోదు. వేదములు శాస్త్రములెన్ని శోధించినా ఆ వాక్యముతప్ప మరేమిలేదని తెలుసుకొనుము

శ్రీ= పై కప్పు వర్షమునకు కారుచుండునని, ఇంటికి వాయువ్య మూల తగ్గుగా వున్నదని, అక్కడ వర్షపునీరు నిలుచునని అన్నారే - గ్రహము లెట్లుండును.

గు= వత్సా, నీటికి గగనభాగమునకు - వాయువ్యమూలకు చంద్రుడధిపతి గాబట్టి, ఆ చంద్రుడు పాపియై చతుర్థదశ మములందుండిన ఎక్కువగా కారుచుండును లేక వేరొక చోట వుండినను వాయువ్యమూలన గుమ్మళ్లుబడుట, ఇంటి కావల వాయువ్యమున నీళ్లు నిలుచుట, జలజార్లు నియమిం చుట, బావులుండుట, జలజారి గుంతలు త్రవ్వకొనుట గలుగును.

శ్రీ= గృహమునకు యే గ్రహము - యే స్థానము బలముగా నుండవలయునందురు.

గు॥ నాయనా, గృహకారకుడు గురువుగదా. శనిపాలిత లగ్నములకు గురువు పాపియగును. ఉదాహరణకు వక లగ్నము చూతుము. వృషభలగ్నమునకు చతుర్థస్థానము సింహము. సింహస్థానాధిపతి సూర్యుడు - సూర్యుని సింహమును లగ్న పంచమ భాగ్యస్థానాధిపతులగు శుక్ర బుధ శనులు చూడడముగాని, వుండడముగాని వుంటే, గురువును (కారకుడు) శని మూడింటగాని, పదింటగాని చూచిన సంపూర్ణ గృహయోగముండును. మరొక ఉదాహరణ = కటకలగ్నమునకు చతుర్థము శుక్రక్షేత్రము గదా. ఆ శుక్రునకు మరొక గృహము వృషభమున్నది. తులా వృషభములలో లగ్న పంచమ భాగ్యాధిపతులుండుటో చూచుటో గలిగి, శుక్రుని వీరిలో నొకరు చూచిన, ఆ జాతకునకు గృహయోగము సంపూర్ణముగా నున్నట్లగును. కటకమునకు గురువు శుభుడుగాబట్టి, గురువును వేరేగ్రహములు చూడనక్కరలేదు. శని పాలితులకు గురువును వక గ్రహము చూడవలయును. - గ్రహము, స్థానము, గ్రహస్థానములు శుభస్థితినొందిన ప్రబలయోగము. అట్టివారే సుఖశాంతులతో కాలము గడుపుచున్నారు.

ఏ విషయమునకైన దేనికైన స్థానము కారకుడు. గ్రహస్థానములు శుభస్థితిజెందవలయును. ఉదాహరణ - సింహలగ్నమునకు చతుర్థము వృశ్చికము - వృశ్చికస్థానాధిపతి కుజుడు - కుజుని మరొక యిల్లు మేషము - వృశ్చికము, మేషము, కుజుడు మూడు శుభస్థితిజెందిన భూమికి గృహములకు స్థలములకు మేర వుండదు. - సింహమున కుజుడు, వృశ్చికమున రవి, మేషమున గురుడుండిన - వృశ్చిక మేషములు కుజుడు శుభస్థితి నొందినది గదా. దీనికితోడు పూర్వభాద్ర నాల్గవ పాదమున చంద్రుడుండిన రాజా గా జన్మించును దీనిని దశానుకూలత అనెదరు.

గ్రహయోగ మిట్లుండక, గ్రహము పక గ్రహము శుభ ముగానుండిన సామాన్య యోగము. గ్రహమే శుభుడైన అధమము. స్థానము స్థానాధిపతి గ్రహములకు కారకుడు చెడినవారే, గ్రహము లేనివారు.

ప్రాజెక్టులు, చెరువులు, కాల్వలు, కుంటలు వీటికి చంద్ర కుజులు వీరి గ్రహములు శుభస్థితిలో నుండవల యును. నీటికి చంద్రుడు, మట్టికి కట్టకు కుజుడు కారకులు. ఇక స్థానాధిపతి స్థానాధిపతి గ్రహములు శుభముగా నుండిన ప్రబలయోగమై పాపగ్రహములు చతుర్థ దశమ ముల యెన్నిమార్లు తిరిగినా చెడకుండ వుండగలదు. స్థిర ముగా నుండగలదు. - కుజ చంద్రులు పాపులైనచో ఏనాటికైన ప్రజలకు ప్రాణభయమున్నట్లేనని తలంచుము.

కోటలకు, బురుజులకు, రోడ్లు వేయుటకు కుజగ్రహము కుజక్షేత్రములు శుభస్థితిలోనుండి, చతుర్థమున నొక శుభ గ్రహముండుటో చూచుటో కావలయును. అవి స్థిరస్థా యిగా నుండగలవు కాలానుగుణ్యముగా చెడినను, మళ్లీ వెంటనే తయారగుచుండును.

(స్కూల్లు) విద్యామందిరములు, విశ్వవిద్యాలయ ములకు గానకళా నృత్యమందిరములకు, సంగీత సాహిత్య అకాడమీలకు శుక్రుడు శుక్రక్షేత్రములు శుభస్థరముగా నుండవలయును. - వ్యతిరిక్తమైన సంగీత సాహిత్యములు వృద్ధినొందవు. ప్రజోపయుక్తమగు గ్రంథములు వెలు వడవు. సంగీతము వృద్ధిచెందదు.

కళాకారులనిపించుకొను వారి జాతకముల పరికింపు ము. సినిమాలు, నాటకాలు, పాటకచ్చేరీలు శనిపాలిత జాతకులై - శుక్ర శని బుధ గ్రహబలముతో లక్షలాదిగా ధనము సంపాదించుకొను చున్నారు. శుక్రుడు పాపిద్దై

బాధించెడువారు వారిచెంత సేవచేయుచు, తిండికి గుడ్డకు చాలక వ్యభిచారులై దుఃఖించుచున్నారు.

వేద పాఠశాలలు, సంస్కృత పాఠశాలలు గురు గ్రహము. గురు గృహములు రెండు శుభస్థితిలో నున్నప్పుడు కట్టవలయును. ప్రారంభింపవలయును. గురుపాలిత లగ్నముగా నుండవలయును.

కాలేజీలు, హైస్కూల్సు రవి సింహము శుభస్కానముగా నున్నప్పుడు, చతుర్థశుద్ధి గలిగినప్పుడు, చంద్రుడు శుక్రుడు లగ్న పంచమ భాగ్యస్థానాధిపతుల చేచిక్కినప్పుడు కట్టిన, ప్రారంభించినా చదివి ప్రభుత్వమునకు ప్రజలకుపకరించు విద్యార్థులు చేరుదురు ఉన్నతస్థితినందుకొందురు. మంచి ఉపాధ్యాయులు చేరుకొందురు. - అటుగాకున్న మొద్దు విద్యార్థులు, సోమరులైన ఉపాధ్యాయులు చేరుదురు. స్కూలుకు చెడ్డపేరువచ్చును

పోలీసుస్టేషనులు, పోలీసులు, విద్యనభ్యసించు స్థలములు, మిల్టరీ స్థలములు, నివాసములు, అభ్యసించు స్థలములు, ధాన్యము నిల్వచేయు స్థలములు, వనములువేయు స్థలములు, కోటలు కట్టు స్థలములు కుజుడు. కుజక్షేత్రములు రెండు శుభస్కారమై యుండవలయును. గురుపాలిత లగ్నమై చతుర్థమున శుభులుండవలయును. - ఉ॥ మేష లగ్నమై మకరమున కుజుడుండి, వృశ్చికమున రవి యున్న- కుజుడు ఉచ్ఛస్థితినొంది మేష కటక సింహముల చూచును పంచమాధిపతి రవి వృశ్చికమందుండును. కుజుడు కుజ క్షేత్రములు చతుర్థము శుభస్కారమగును ఆ స్టేషను, ఆ మిల్టరీ సంపూర్ణముగు అభివృద్ధిచెందును. శత్రుభయంకరమై ప్రకాశించును. ఆ పరగణములో యేవి క్రూర కర్మలు జరుగవు. జరిగిన బయల్పడి తీరును

శ్రీ= స్వామి, ఆ ఇంటిలో చేరినప్పటినుండి జబ్బులు విడుచుట లేదు. పిల్లలకు ఒకరికిపోయిన మరొకరికి జబ్బు వచ్చుచునే వున్నది. యేమనెదరు అని అడుగుదురు.

గు= వత్సా, గోచారరీత్యా గ్రహములు మారుచుండునుగదా. రోగస్థానమునకు పాపగ్రహములు వచ్చినప్పుడు శత్రురోగ ఋణవిపత్తుల గలిగించుచునే వుండును. పంచమమునకు గురుపాలితులకు శని, శనిపాలితులకు గురువు వచ్చినప్పుడు సంతతిని రోగపీడితులచేయును. సంసార చిక్కుల గల్పించును. ధనవ్యయము చేయించును. ఇట్టివి జరుగుచునే వుండును. - జననకాలములో ఆరవ యింట పాపగ్రహమున్నవాడు యే యింటికిపోయిన శత్రురోగ ఋణ విపత్తులు గలుగుచునేవుండును. పంచమమున పాపగ్రహమున్నవానికి సంతతికి అనిష్టలుండనేవుండును. యే యింటిలో నుండినను బాధించుచునేవుండును. - గృహములో యేమి వుండదు. యిట్టివి ఆధారము చేసుకొని మాంత్రికులు యంత్రములువేసి లాభము గందురు. వాస్తుగ్రంథముల చదివినవారు ఆ చూలు యీ చూలని, అది తక్కువ యిది తక్కువని, యింటికి ఆయుర్దాయము తీరినదని యెత్తు చేయుమని తగ్గబీకమని. మత్స్యయంత్రము కూర్మయంత్రము వేసి, అష్టదిగ్బంధనచేసి లాభము గడింతురు. ఆ గ్రహము ఆ స్థానము విడిచినంతవరకు ఆబాధలుండనేవుండును. వీరు గృహస్థులకు చీడ పురుగులు. - యిది చూచి కొందరు మూఢనమ్మకమని ద్విపాద జంతువులని పలుకుచుందురు. గృహము జాతకుననుసరించియేయుండును. జరుగవలసినది జరుగుచునేవుండును.

శ్రీ= స్వామి, ముందున్న గృహమును కాదని, పశ్చిమమునకు దక్షిణమునకు జరిగి యిల్లు కట్టరాదని వాస్తుగ్రంథకర్తల న్నారే, నిజమేనందురా?

గు= పత్నా, శని శుభుడై చతుర్థమందుండినను చూచినను యింటి పరమట, చేనికి పరమట, తోటకు పరమట, కల్లమునకు పరమట, స్థలమునకు పరమట ఉన్న వారికి యిబ్బందులు గలిగించి విడిపించి ఆ స్థలము యిప్పించును. దాని వల్ల శుభమేగాని, అశుభము యేనాటికి గలుగదు. వీరు శనిపాలిత జాతకులు. శని పశ్చిమాధిపతి గాన పశ్చిమమునకే దారి చూపించుచుండును.

కుజుడు శుభుడై చతుర్థమందున్నను, చతుర్థమును చూచినను దక్షిణాధిపతి గాబట్టి, దక్షిణభాగమును విశాలము చేయుచునే వుండును. స్థలము మొదలుకొని సర్వము దక్షిణమునకే విశాలము చేయుచుండును. సకలసౌకర్యములు గలుగును. గృహముగా మార్చును. గాన దక్షిణమునకు పోకూడదనిన యెట్లు. ఏ గ్రహము చతుర్థముననుండునో, చూచునో ఆ దిశన సౌకర్యము గలిగించుచునే వుండును. వాస్తువిషయమే తెలియక, గ్రహములయొక్క బలమే యరుంగక యుక్తాయుక్తముగా వ్రాసిన వాస్తులుగాబట్టి వారట్లు తెలిపిరి. శనిని కుజుని పాపుల క్రింద జమకట్టి ఆ దిశలకు జరుగరాదనిరి. తూర్పుదిశకున్న సూర్యుని మధ్యకు మార్చి, శుక్రుని తూర్పునకధిపతిని చేసిరిగాబట్టి తూర్పును వదలిరి. గ్రహములలో నైసర్గిక పాపులని (శుద్ధపాపులు) నిరూపించిన రవి కుజ శని రాహువు కేతువులలో శని కుజులు ప్రబలురని ఆ దిశలకే పోరాదు జరుగరాదన్నారు నిజమెరుగక పలికిన ప్రమాదవచనములని నెరుంగుము. శాస్త్ర దూష్యమిదా వచనము. — భూమికధిపతి కుజుడు. ఇంతటి ఆధిపత్యము కుజునకెట్లొసంగిరో వారెరుంగరా. ఆయుః కారకత్వము గలిగి అర్ధప్రపంచమున కధిపతియగు శని యని వారికి తెలియద. ఇట్టి వీరిని వీరి దిశలను వలదనిన వారు తెలిసినవారా. వారిచే రచింపబడిన గ్రంథములు

గ్రంథములా. లోకులు వీరి శాస్త్రములు మూఢనమ్మక మనరా యోచింపుము. - శని పాలితులు పశ్చిమము నకు, గురు పాలితులు దక్షిణమునకు జరుగవచ్చును.

అష్ట దిక్కులను శని గురుపాలితులు సమముగా పంచుకున్నారు చూడుము తూర్పునకధిపతి రవి. దాని కెదురు పశ్చిమమునకధిపతి శని. - దక్షిణమునకధిపతి కుజుడు. దాని కెదురు ఉత్తరమునకధిపతి బుధుడు - నాలుగు దిక్కులలో తూర్పు దక్షిణములకు గురు పాలితులు. పశ్చిమోత్తరములకు శని పాలితులు. - ఆగ్నేయమునకు శుక్రుడు, వాయువ్యమునకు చంద్రుడు, ఈశాన్యమునకు గురు కేతువులు, నైరుతికి రాహువు ఇట్లొసంగిరి. శుక్ర రాహువులు శని పాలితులు. గురు కేతు చంద్రులు గురు పాలితులు. వకరికొకరెదురు అష్టదిక్కుల సమముగా పంచుకున్నారు. - భూమి సకలవస్తువుల సృష్టించునది. ఆకాశము వర్షించునది. - భూమి స్త్రీ రూపము. అకాశము పురుషరూపము గాన శనిపాలితుల నీ రెండిటిలో చేర్చ లేదు. సకల జీవుల బ్రతికింపవలసిన గ్రహములు గాబట్టి, కుజునికి భూమి చంద్రునకు ఆకాశము కారకత్వముల దిశల ఆధిపత్యము గలిగెను. - వీరిలో నైజపాపులెవరు లేరు. స్థానాధిపత్య దోషముతప్ప గ్రహములలో పాపులు లేరని గ్రహించు - ఉ॥ మకరలగ్నమునకు సూర్యుడు అష్టమాధిపత్యము వహించుటచేత పాపి యయ్యనే గాని, పాపి యగునా ఆధిపత్య దోషము ప్రతి గ్రహమునకున్నదని తెలుసుకొనుము.

శ్రీ = స్వామి, కొందరు చతుర్దిక్కుల గృహముల గల్పించి మధ్యలో గాలీ వెలుతురు వచ్చుటకు, బావిని త్రవ్వకొనుటకు, స్థలమువిడచి బావిని త్రవ్వకొందురు శుభమేనందుర.

గు = వత్సా, మధ్యలో కప్పువేయక, మధ్యప్రదేశము తగ్గుచేసి

అందులో బావి త్రవ్వి స్నానాలుచేయుట, కాష్టకములగుట, గుడ్డలుతుకుట చేసిన గృహములో తలలో జబ్బులేర్పడును. వంశవృక్షము నిలుచుట కష్టము - ఆ గృహము స్త్రీల పరమగును. ఆ గృహము ఇతరుల పాలగుట నిశ్చయము. నలుమూలల వారి వాకిండ్లు వచ్చుటచేత, మధ్య బయలు యేర్పడుటచేత, మధ్యలో కూప మేర్పడుటచేత, అన్ని గృహములకు ముఖద్వారము వకటియగుటచేత వంశస్థులు నశింపై ఇతరుల పాలగుట నిశ్చయము. గృహమున కుండవలసిన హంగులు లేకుండుటవల్ల వంశక్షయము.

శ్రీ= స్వామి, గృహమునకొక ప్రక్క పొరగోడ (వకరాయి వరుస పెట్టుకొందురే, యిది శుభమేనందుర.

గు= వత్సా, ఒక ప్రక్క గోడ వెడల్పు యెన్ని అంగుళములో మరొక ప్రక్కనంతేయుండుట సవ్యము. - కుడియెడమలొకటిగా నుండవలయును. - కుడి పురుషుడు, ఎడమ స్త్రీ. యె ప్రక్క పొరగోడ వచ్చునో ఆ ప్రక్కన విపరీతఫలము సంప్రాప్తించును. అనగా రోగగ్రస్తులగుటో, కోపగ్రస్తులగుటో, ఒకరుండి వకరు లేక పోవుటో తప్పదు. చూపుడు దూలము, చూపుడు స్తంభము, పొర గోడ కుటుంబీకులకు మంచిది కాదు. యిట్టి యిండ్లలో విరధులుందురు. దుఃఖ జీవనులగుదురు.

శ్రీ= స్వామి, గృహములో రోలు ఎక్కడుండుట మంచిదందురు.

గు= రోలు - ప్రాణిచయమును అప్రాణిచయముగా మార్చునది. గానుగకూడ యింతే. - ఈ రెండు వాకిండ్లకెదురుగ నుండరాదు. అట్లు వుండిన యింటిలో కలహములుండును. దుఃఖ జీవులుందురు. ముక్కోపులుందురు. పాలు త్రాగు పిల్లలకు జబ్బులుండును. రాను రాను వంశాభివృద్ధి తగ్గును గాన వాకిలి కిరుప్రక్కల వేయుట శ్రేయము.

శ్రీ= స్వామీ, కొన్ని ప్రాంతములలో దొంతికుండలని వకటి మొదలుకొని యేడువరకు దొంతులుగా నియమించుకొం దురు. ఎందుకిట్ల పెట్టినారని అడిగిన, దొంతికుండలు సిరి సంపదలను రాగోరునన్నారు. - ఇంటికిల్లాలు వచ్చినా, దొంతికి కుండవచ్చినా, గాటికి పశువువచ్చినా అదృష్ట దురదృష్టములుండునన్నారు. - బ్రాహ్మణులు యజ్ఞోప వీతము వేసుకొనె, యజ్ఞోపవీతం పరమపవిత్రం అన్నారు గృహాములో యేడు దొంతులు కలసి 28 కుండలగును. - యజ్ఞోపవీతము దారములు 27, పైన పరమాత్మ వెరసి 28 (27 తత్వములు, పరమాత్మ 28) గృహామునకు దొంతులు పరమపవిత్రమైనవి వుండవలయునందురు. బ్రాహ్మణులకు యజ్ఞోపవీతమెంతో గృహామునకు దొంతులు అంతే నను కొనుము. నవధాన్యములు దొంతులలో నుండుటవల్ల సిరి సంపదల రాగోరునని వారి భావము.

శ్రీ= స్వామి, మిద్దెలపై వర్షపునీళ్లు ముందుకు కొందరు, ప్రక్క లకు కొందరు తూములు నియమించుచున్నారే, శుభమే నందుర.

గు= వత్సా, వెనుకకు పోవుట మంచిది తలనుంచి కాళ్లవరకు నీరుపోవునట్లు - తలవాకిటినుంచి దొడ్డివాకిటి వరకు ప్రవ హించుట శ్రేయము ముందుకు, ప్రక్కలకు వచ్చుట నీచము. ఆ గృహాస్తునికి చంద్రుడు పాపిష్టైన నీరును విరు ద్ధముగా నడిపించును. విపత్తుల గలిగించును.

శ్రీ= స్వామి, సప్తమమున యే గ్రహాము లేక చూడకపోయిన యేమగునందురు.

గు= వత్సా, గ్రహాము చూడకపోయిన ఆ గృహాము ఏ గ్రహా ముదో ఆ కారకత్వములతో విపరీతఫలమిచ్చి నశింపుచేసి పడగొట్టును. లేదా మూతపడును. కడకు విక్రయింప బడును.

శ్రీ= గృహామునకు ఇరుప్రక్కల అనగా తృతీయ పంచమముల గ్రహాములు లేకున్న యేమగునందురు.

గు= గ్రహాములు లేక చూడకపోయిన స్థానములు ఏ గ్రహాములవో ఆ కారకత్వములచేత ధ్వంసము చేయును. మూత బడుట, విక్రయమగుట తప్పదు.

శ్రీ= ఆ చోటును కొని ఇల్లుకట్టిన వారి శుభాశుభము లేమందురు.

గు= వత్సా, వారికాగతులే గలుగును. లేదా వాని గ్రహాములు బలవత్తరమైనచో ఈ గృహాస్తుని పదచ్యుతుని చేయును. జాతకుని చతుర్థమునకు యిరువాగుల శుభగ్రహాములున్న, యిరుప్రక్కల శుభముగా గృహాములుండును. - సప్తమమున శుభగ్రహామున్న యెదురిల్లు బాగుండును. ద్వాదశమమున శుభగ్రహామున్న వెనుక యిల్లు బాగుండును. దొడ్డివాకిలుండును లోదొడ్డివుండును. పాపగ్రహామున్న వెనుకభాగమున స్థలముండదు.

శ్రీ= స్నానాల గదులు కొన్ని యిండ్లకు ముందు భాగమునకు వచ్చును. మరుగుదొడ్లు ముందుకే వచ్చును. ఏ గ్రహాము వల్లనందురు.

గు= చంద్రుడు పాపియైన వెనుక వుండవలసిన స్నానాల గదిని ముందుకు తెచ్చును - శని పాపియైన పాయిఖానా ముందుకు తెచ్చును. - లేదా మలమూత్రములకు పోవుటకు కష్టము తెచ్చును. (దూరముగా పోవలసి వచ్చును ) - గురువు పాపియైన పాపులచే చూడబడిన దేవతార్చనా గది కుదరదు. కుదరకున్నను దేవుడు సర్వతోముఖుడు గాబట్టి, యెటు త్రిప్పియైన పెట్టుకొనవచ్చును. శుక్రుడు పాపియైన పాకశాల చక్కగా కుదురనియ్యడు - విరుద్ధ స్థలమునందు గాని, ఇరుకుగా గాని, చీకటిగా, పొగపోక చిక్కులు గల్పించును. - బుధుడు పాపియైన ఉగ్రాణపు

యిల్లు (సరుకులు పెట్టుకొనునది) యిరుకుచేయును. చీకటి గదిగానుండును - సూర్యుడు పాపియైన ముఖద్వారము వాలు చిన్నదిగాచేసి, పదిమంది కూర్చుని మాట్లాడుటకు ఇరుకుచేయును. వెలుతురు లేకుండును. - రాహు కేతువులు తూర్పు పడమరలు చక్కగానుండనియ్యక, ఈశాన్యమునుండి నైరుతికి ఇల్లును త్రిప్పెదురు. సవ్యముగా నుండనివ్వరు. వీధిలో స్థలము ఒకప్రక్క ఎక్కువ, ఒకప్రక్క తక్కువ చేయుదురు. - ఇవి అన్నియు జాతకానుగుణ్యముగా నుండును. సరిచేయుటకు అలవిగాదు. వీలున్నంతలో సవరణ చేయవలయును.

శ్రీ= స్వామి, దీపము యింటిలో వాకిటికెదురుగా పెట్టుకొనవచ్చునా.

గు= వాకిటికెదురు తప్పించి పెట్టుకొనుట వీరికి యెదురింటికి క్షేమము. లేకున్న రెండిండ్లలో నొకటి ఛిద్ర గృహమగును. కంటి జబ్బులు గలుగును.

శ్రీ= కొంత యిల్లు తగ్గు, కొంత యిల్లు యెత్తు కట్టుకొందురే - మంచిదేనందుర.

గు= ఇది కుజుడు పాపియైనవారికి కుదురును. చంద్రుడు పాపియైనవారికి పైన కుదురును. అట్లుండుట శ్రేయముగాదు. క్రమబద్ధముగానుండుట శ్రేయము. దీనితో వక్రగతి గలవారుందురు. విపరీతభావములు గలవారుందురు.

శ్రీ= పోటు తిరిగేసి యిండ్లలో ప్రకృతమున్నవారు బాగుగనే వున్నారే, దీని నేమందురు

గు= ఆ స్థానము తలల మార్చివుండును. - ముందున్నవారెట్టి చిక్కులతో పోయిరో, వీరు అట్టి చిక్కులకు లోనగుదురు. నిశ్చయము.

శ్రీ= సత్రమునకు, కీర్ల బావిడికి, దేవాలయమునకు అనించి

ఇల్లు కట్టుకుంటే, శుభమా - అశుభమా.

గు= ఇది భయంకరము. - పాపము ఎంతో పోవుచుందురు. ప్రకృతము కట్టించినవాడు చిన్నా భిన్నమగును. - మనిషి పోవునంత వరకు విడచి కట్టిన క్షేమము ఉండును.

శ్రీ= స్వామి! తనయింటి కెదురిల్లు తనదిగా నున్నచో, ఏమి యగు నందురు.

గు= తన జాతకమున సప్తమములో శుభగ్రహము బలీయముగా నుండినను, దశమమున నుండినను యెదురిల్లు తనదిగా నుండును. శుభముగా నుండును. - పాపగ్రహము సప్తమములో నుండిన ఎదురిల్లు పాడై తన వశమగును. దానిని తాను వేసుకొనిన అశుభములనే చేకూర్చును. తనవారి నెవరిని అక్కడుంచరాదు. దెబ్బతీయును. దానిని విశిష్ఠలముగా, యేవో కొన్ని వస్తువులుంచుకొనుటకుగా నుంచు కొనవలయును.

శ్రీ= ఇరువాగుల తన గృహములే నుండ [illegible] నే మందురు.

గు= చతుర్థమునకు ఇరుప్రక్కల అనగా తృతీయ పంచమము లందు పాపగ్రహములున్న - ఇరువాగుల గృహములు మూతపడును. పాడగును. నిర్ధనికులగుదురు - అంతా కొంతకాలమునకు అద్దెయింట్లగుటో అమ్ముటో తప్పదు. శుభగ్రహములున్న తనకు లభించును శుభముగానుండును. పాపగ్రహములున్న గృహమే లేకపోవుటగాని, వంటుగాని ఏర్పడును. శుభగ్రహములున్న ఉన్నవారు క్షేమముగా నుందురు

శ్రీ= స్వామి, చతుర్దిక్కుల గృహములు లేక ప్రహారి ఏర్పడిన గృహములు గలచే, వారికే గ్రహము బలముగా నుండు నందురు.

గు= చతుర్దిక్కుల స్థలమేర్పడుటకు ప్రవహరిగోడలు గలుగుటకు చంద్రుడుగాని, కుజుడుగాని శుభులై చతుర్థ దశమముల నుండవలయును. - అట్లుండిన మహాడీతో యేర్పడును. మహాడీకి రవి చంద్రులు కారకులు.

శ్రీ= ఎప్పుడూ పదిమంది జనాభా ఒకగృహములో నుందురే, కారణమేమందురు.

గు= వత్సా, చంద్రుడు శుభుడై యుండిన పదుగురతో ఆ యిల్లు కలకల లాడుచుండును. - పాపిష్ఠియై యుండిన అప్రయోజకుల గుంపు నేర్పరచి పదభ్రష్టము చేయుటో, బిడ్డలు లేక పాడగుటో తప్పదు.

— శుభం భూయాత్ —

## ఆదిత్యాది నవగ్రహానుగ్రహ సిద్ధిరస్తు



## ※ సప్తమహా జ్యోతిస్సారము ※

ప్రకృతమున్న జ్యోతిష వాస్తుగ్రంథములు కృత్రిమములని నిరూపించి, మార్గదర్శకమిచ్చు సద్గ్రంథము. జ్యోతిశ్శాస్త్రాభిలాష గలవారందరు చూడతగినది ఇదివరకెన్నడు చూడనిది.

వెల రు 10—00

## ※ జ్ఞానజ్యోతి ※

విద్యార్థులకు కల్పవృక్షము నంటిది. - నీతి నియమములకు పెన్నిధివంటిది. - ప్రాథమిక దైవధ్యాన శ్లోకములతో, పద్యములతో కూడినది. వెల రు. 1—50